STv SAMAYAM

epaper.samayamdaily.net

APTEL/2006/18267

సమయం

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక

epaper.samayamdaily.net APTEL/2006/18267

సమయం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

7036644111, 9490140565

సంపుటి: 19 | సంచిక: 352 | ఎడిటర్ : అలీ ముర్తుజా | ఆదివారం 22 నవంబర్ 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 8 | వెల:రూ.5 |

అగ్రిగోల్డ్ బాధితులకు ఊరట

- బాండ్ల పరిశీలనకు షెడ్యూల్!
- ఈ నెల 25 నుంచి బాండ్లు, రశీదుల ధ్రువీకరణ
- రాష్ట్రవ్యాప్తంగా 10 ప్రత్యేక కేంద్రాల ఏర్పాటు
- రూ.447 కోట్ల కుంభకోణంలో 1.65 లక్షల మంది బాధితులు
- అసలు బాండ్లు, ఆధార్, బ్యాంకు వివరాలతో హాజరుకావాలి
- డిపాజిటర్లు, నామినీలు, చట్టబద్ధ వారసులకు అవకాశం

2

అగ్రిగోల్డ్ బాధితులకు తెలంగాణ నేర పరిశోధన విభాగం (సీఐడీ) కీలక సమాచారం వెల్లడించింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.447 కోట్ల అగ్రిగోల్డ్ కుంభకోణంలో నష్టపోయిన 1.65 లక్షల మంది డిపాజిటర్ల బాండ్లు, రశీదుల పరిశీలనకు షెడ్యూల్ విడుదల చేసింది. ఈ నెల 25 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 10 ప్రత్యేక కేంద్రాల్లో అసలు బాండ్లు, నగదు రశీదుల ధ్రువీకరణ, నమోదు ప్రక్రియ చేపట్టనున్నట్లు సీఐడీ అధికారులు తెలిపారు.



తుపాకులు కొనుక్కోండి!

- హిందువులకు గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ వివాదాస్పద పిలుపు
- భవిష్యత్తులో హిందువుల భద్రతకు ముప్పు ఉందంటూ వ్యాఖ్యలు

3

సీఎం తీరుతోనే ఏపీ జల దోపిడీ

- నాగార్జున సాగర్ పై ఏపీ అక్రమ ప్రాజెక్టును వారం రోజుల్లో నిలిపివేయించాలి
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

2





హైదరాబాద్‌లో విచ్చలవిడిగా డ్రగ్స్ సరఫరా!

మత్తు పదార్థాల బారిన పడుతున్న యువతపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆందోళన

మూతపడిన పరిశ్రమల్లో డ్రగ్స్ తయారీ..

ఇళ్ల మేడలపై గంజాయి సాగు


3



జేఈఈ మెయిన్ దరఖాస్తులకు నేడే ఆఖరి గడువు!

జనవరి 20 నుంచి తొలి విడత పరీక్షలు


.. వివరాలు 4లో



ఏఐ డిటెక్టర్లను నమ్మి విద్యార్థులను శిక్షించొద్దు!

- ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్

.. వివరాలు 3లో



గాంధీలో పసికందు కిడ్నాప్

.. వివరాలు 2లో

మంత్రి వర్గ విస్తరణకు రాహుల్ గ్రీన్ సిగ్నల్!?



- రేవంత్ కేబినెట్ విస్తరణకు అధిష్ఠానం సుముఖత
- భారత్ సమ్మిట్ భేటీతో పెరిగిన ముఖ్యమంత్రి ప్రాధాన్యం
- ఖాళీగా ఉన్న మూడు మంత్రి పదవుల భర్తీకి కసరత్తు
- సీనియర్ల శాఖల్లో మార్పులు, కొత్తవారికి అవకాశాలు
- సంక్రాంతిలోపు కేబినెట్ ప్రక్షాళనకు అవకాశం

వివరాలు 2లో..

తెలంగాణ మంత్రివర్గ విస్తరణకు రంగం సిద్ధమవుతోందా? కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నుంచి సీఎం రేవంత్ రెడ్డికి గ్రీన్‌సిగ్నల్ లభించిందా? ఖాళీగా ఉన్న మంత్రి పదవుల భర్తీతోపాటు ప్రస్తుత మంత్రుల శాఖల్లోనూ భారీ మార్పులు జరగనున్నాయా? ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో ఈ ప్రశ్నలే ఆసక్తికర చర్చకు దారితీస్తున్నాయి. మంత్రివర్గ విస్తరణకు కాంగ్రెస్ అధిష్ఠానం సానుకూలంగా ఉన్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వం మూడేళ్ల పాలనలోకి అడుగుపెడుతున్న నేపథ్యంలో కేబినెట్‌ను పునర్వ్యవస్థీకరించేందుకు రేవంత్ రెడ్డి కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. అయితే విస్తరణకు రాహుల్ గాంధీ అధికారికంగా ఆమోదం తెలిపినట్లు ఇంకా ధ్రువీకరణ వెలువడలేదు.

మంత్రి పేషీ పేరుతో ఉద్యోగాల దందా!



- శ్రీధర్‌బాబు ఓఎస్డీనంటూ నిరుద్యోగులకు టోకరా
- నలుగురి నుంచి రూ.50.87 లక్షలు వసూలు
- నకిలీ గుర్తింపు కార్డులు, నియామక ఉత్తర్వులతో మోసం
- ప్రభుత్వ వెబ్‌సైట్లను పోలిన నకిలీ పోర్టళ్ల సృష్టి

2



కేసీఆర్ భూముల లెక్కలన్నీ అసెంబ్లీలో తేల్చుతాం!

- ల్యాండ్స్ సర్వే ప్రక్రియ దాదాపుపూర్తి
- సర్వే మొదలవగానే కోర్టును ఆశ్రయించిన హరీశ్ రావు మామ
- కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణంపై కేసీఆర్‌కు ప్రశ్నలు
- వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌దే అధికారం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

2

రాజగోపాల్ రెడ్డికి హైకమాండ్ పిలుపు

నవంబర్ 23న బీఎం సందీప్‌తో భేటీ

2



ఎక్కువ మంది పిల్లలను కనండి!

అమెరికా యువతకు కరోలిన్ లీవిట్ పిలుపు

.. వివరాలు 4లో

రాహుల్ వ్యాఖ్యలకు రిజిజు కౌంటర్

- 1962 చైనా యుద్ధంపై క్షమాపణ చెబుతారా?
- దేశాన్ని పేదరికంలో ఎందుకు ఉంచారు?
- భారత్ ప్రతిష్ఠను ఎందుకు తగ్గించారు?
- మోదీని 'రాజీ పడిన ప్రధాని' అన్న రాహుల్

.. వివరాలు 4లో



గంగానదిపై 'నితీశే సేతు' ప్రారంభం

- ఆరు వరుసల భారీ వంతెనను జాతికి అంకితం చేసిన ప్రధాని మోదీ
- పాట్నా-వైశాలి మధ్య మరింత సులభతరం కానున్న రాకపోకలు
- బిహార్‌లో రూ.34,470 కోట్ల అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం
- రహదారులు, విద్యుత్, సాగునీటి రంగాలకు భారీ ప్రోత్సాహం



4



రాజగోపాల్ రెడ్డికి హైకమాండ్ పిలుపు

నవంబర్ 23న బీఎం సందీప్‌తో భేటీ

ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ ఫోన్

హైదరాబాద్, నవంబర్ 21 (సమయం న్యూస్): తెలంగాణ కాంగ్రెస్‌లో నెలకొన్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని పార్టీ అధిష్టానం ఢిల్లీకి పిలిచింది. రాష్ట్ర కాంగ్రెస్ కొత్త ఇన్‌చార్జ్ బీఎం సందీప్‌తో ఈ నెల 23న సమావేశం కావాలని సూచించింది. ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ ఫోన్ చేసి రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై వివరాలు తెలుసుకోవడంతోపాటు భేటీకి సిద్ధంగా ఉండాలని కోరారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వ పనితీరుపై రాజగోపాల్ రెడ్డి బహిరంగ విమర్శలు చేస్తున్న నేపథ్యంలో ఈ సమావేశానికి ప్రాధాన్యం ఏర్పడింది. ఈ పరిణామాల మధ్య ఆయనకు మంత్రి పదవి దక్కుతుందా లేదా అన్న అంశంపై పార్టీలో చర్చ సాగుతోంది. నవంబర్ 22న హైదరాబాద్‌కు రానున్న బీఎం సందీప్ గాంధీభవన్‌లో పీఏసీ, విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశాల్లో పాల్గొననున్నారు. మరుసటి రోజు రాజగోపాల్ రెడ్డితో భేటీ కానున్నారు. ప్రభుత్వ పనితీరుపై తన అసంతృప్తి, ఎదురవుతున్న ఇబ్బందులను ఇన్‌చార్జ్ దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే తెలిపారు. తాను పార్టీ మారే ఆలోచనలో లేనని, రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు.

మంత్రి పేషీ పేరుతో ఉద్యోగాల దందా..

నలుగురి వద్ద రూ.50 లక్షలు వసూలు చేసిన నకిలీ ఓఎస్డీ!

నకిలీ ఐడీ కార్డులు, నియామక ఉత్తర్వుల సృష్టి

హైదరాబాద్, నవంబర్ 21 (సమయం న్యూస్): ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులను లక్ష్యంగా చేసుకుని ఓ వ్యక్తి భారీ మోసానికి పాల్పడ్డాడు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ఓఎస్డీగా పరిచయం చేసుకుంటూ నలుగురు బాధితుల నుంచి రూ.50.87 లక్షలు వసూలు చేశాడు. కొలుగూరి రవికిరణ్ అనే వ్యక్తి చేసిన ఈ మోసం తాజాగా వెలుగులోకి వచ్చింది. నిందితుడు నకిలీ ఓఎస్డీ గుర్తింపు కార్డులు, ప్రభుత్వ నియామక ఉత్తర్వులు తయారు చేసి అభ్యర్థులను నమ్మించాడు. ప్రభుత్వ వెబ్‌సైట్లను పోలిన నకిలీ పోర్టళ్లను సృష్టించి మోసానికి పాల్పడ్డాడు. టీచర్, మున్సిపల్ అటెండర్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్, రికార్డు అసిస్టెంట్ ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి నలుగురి నుంచి భారీగా డబ్బులు వసూలు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితులు మంత్రి కార్యాలయాన్ని ఆశ్రయించడంతో వ్యవహారం బయటపడింది. పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రవికిరణ్‌పై కేసు నమోదైంది. నకిలీ వెబ్‌సైట్లు, డిజిటల్ ఆధారాలు, బ్యాంకు లావాదేవీలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గాంధీ ఆసుపత్రిలో పసికందు కిడ్నాప్..

ఏడు రోజుల ఆడశిశువును అపహరించిన ముఠా

ప్రభుత్వ సాయం పేరుతో తల్లికి మాయమాటలు

లక్ష రూపాయలకు చిన్నారిని విక్రయించిన నిందితులు

గంటల వ్యవధిలోనే కేసును ఛేదించిన పోలీసులు

హైదరాబాద్, నవంబర్ 21 (సమయం న్యూస్): గాంధీ ఆసుపత్రిలో ఏడు రోజుల పసికందు అపహరణ ఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ కేసులో పోలీసులు వేగంగా స్పందించి గంటల వ్యవధిలోనే ఆరుగురు నిందితులను అరెస్టు చేశారు. విచారణలో చిన్నారిని లక్ష రూపాయలకు విక్రయించినట్లు వెల్లడైంది. సికింద్రాబాద్ డీసీపీ బృందం సరగడ హేమలత, షేక్ రిజ్వాన్, మహమ్మద్ నస్రీన్, మహమ్మద్ జానీ, షేక్ షమీనా బేగం, మహమ్మద్ ఇమ్రాన్‌లను అదుపులోకి తీసుకుంది. బిహార్‌కు చెందిన ఓ మహిళ ఇటీవల ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అప్పటికే ఇద్దరు ఆడపిల్లలు ఉండగా, మూడో కాన్పులోనూ ఆడబిడ్డ పుట్టడాన్ని ఆసరాగా చేసుకున్న నిందితులు ఆమెను లక్ష్యంగా చేసుకున్నారు. ఇంట్లో ముగ్గురు ఆడపిల్లలు ఉంటే ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందుతుందని, ఆ మొత్తాన్ని ఇప్పిస్తామని నమ్మబలికారు. ఈ మాయమాటలతో తల్లిని ట్రాప్ చేసి, ఏడు రోజుల పసికందును అపహరించారు. అనంతరం చిన్నారిని లక్ష రూపాయలకు విక్రయించినట్లు పోలీసుల విచారణలో తేలింది. పసికందు కిడ్నాప్ సమాచారం అందిన వెంటనే సికింద్రాబాద్ డీసీపీ రక్షితా మూర్తి ప్రత్యేక దర్యాప్తు బృందాలను రంగంలోకి దించారు. పోలీసులు వేగంగా గాలింపు చర్యలు చేపట్టి, కొన్ని గంటల్లోనే ఆరుగురు నిందితులను గుర్తించి అరెస్టు చేశారు. ఈ ఘటనకు సంబంధించి ఇతర అంశాలపైనా దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



మంత్రి వర్గ విస్తరణకు రాహుల్ గ్రీన్ సిగ్నల్!?

రేవంత్ కేబినెట్ విస్తరణకు అధిష్ఠానం సుముఖత

భారత్ సమ్మిట్ భేటీతో పెరిగిన ముఖ్యమంత్రి ప్రాధాన్యం

ఖాళీగా ఉన్న మూడు మంత్రి పదవుల భర్తీకి కసరత్తు

సీనియర్ల శాఖల్లో మార్పులు, కొత్తవారికి అవకాశాలు

సంక్రాంతిలోపు కేబినెట్ ప్రక్షాళనకు అవకాశం

హైదరాబాద్, నవంబర్ 21 (సమయం న్యూస్): తెలంగాణ మంత్రివర్గ విస్తరణకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సానుకూల సంకేతాలు ఇచ్చినట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వం మూడేళ్ల పాలనలోకి అడుగుపెడుతున్న తరుణంలో కేబినెట్ విస్తరణతో పాటు ప్రక్షాళనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్‌లో జరిగిన భారత్ సమ్మిట్--2026 సందర్భంగా రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రుల మధ్య జరిగిన సమావేశం ఈ ప్రచారానికి బలం చేకూర్చింది. ఈ భేటీలో ముఖ్యమంత్రి, రాహుల్ మధ్య కనిపించిన సమన్వయం రాష్ట్ర మంత్రివర్గ కూర్పుపై రేవంత్‌కు అధిష్టానం స్వేచ్ఛ ఇవ్వబోతోందనే సంకేతంగా కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. 2023 డిసెంబర్ 7న కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గతేడాది జూన్‌లో ముగ్గురు కొత్త మంత్రులను కేబినెట్‌లోకి తీసుకున్నారు. అయినప్పటికీ మూడు మంత్రి పదవులు ఖాళీగానే ఉన్నాయి. ఇటీవల కొండా సురేఖ రాజీనామా పరిణామం, కొందరు మంత్రుల పనితీరుపై అధిష్టానానికి అందిన నివేదికలు కూడా మార్పుల ప్రచారానికి కారణమయ్యాయి. పనితీరు ఆధారంగా కొందరి శాఖలు మార్చడం, మరికొందరిని తప్పించి కొత్తవారికి అవకాశం కల్పించే యోచనలో ఉన్నట్లు సమాచారం. ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్లతో పోలిస్తే ప్రస్తుతం ఢిల్లీ అధిష్టానం వద్ద రేవంత్ రెడ్డి తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మూడేళ్ల పాలన, మున్సిపల్ ఎన్నికల ఫలితాలు, భారత్ సమ్మిట్ నిర్వహణ వంటి అంశాలు రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విశ్వాసాన్ని పెంచాయని పార్టీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. దీంతో మంత్రివర్గ విస్తరణతో పాటు నామినేటెడ్ పదవులు, పీసీసీ నియామకాల్లోనూ ముఖ్యమంత్రి అభిప్రాయానికి ప్రాధాన్యం దక్కవచ్చని భావిస్తున్నారు. ఖాళీగా ఉన్న మూడు మంత్రి పదవుల కోసం పలువురు ఎమ్మెల్యేలు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఉమ్మడి రంగారెడ్డి, నిజామాబాద్, నల్గొండ, ఆదిలాబాద్ జిల్లాలకు కేబినెట్‌లో ప్రాతినిధ్యం లేకపోవడంతో ఆయా ప్రాంతాల నేతలు అవకాశాల కోసం ఎదురుచూస్తున్నారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, సుదర్శన్ రెడ్డి, ప్రేమ్ సాగర్ రావు పేర్లు ఆశావహుల జాబితాలో వినిపిస్తున్నాయి. సామాజిక సమీకరణాలు, సీనియారిటీ, పనితీరును ప్రాతిపదికగా తీసుకుని ఎంపికలు చేపట్టే అవకాశం ఉంది. డిసెంబర్‌లో ప్రభుత్వం



మూడేళ్లు పూర్తి చేసుకున్న తర్వాత లేదా సంక్రాంతిలోపు మంత్రివర్గ విస్తరణ, ప్రక్షాళనపై నిర్ణయం వెలువడవచ్చని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. రాహుల్ గ్రీన్ సిగ్నల్‌తో రేవంత్ తనకు అనుకూలమైన కొత్త బృందాన్ని ఏర్పాటు చేసుకుంటారా, సీనియర్ మంత్రుల శాఖల్లో ఎలాంటి మార్పులు చేస్తారన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

కేసీఆర్ భూముల లెక్కలన్నీ అసెంబ్లీలో తేల్చుతాం!

- ల్యాండ్స్ సర్వే ప్రక్రియ దాదాపుపూర్తి
- సర్వే మొదలవగానే కోర్టును ఆశ్రయించిన హరీశ్ రావు మామ
- కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణంపై కేసీఆర్‌కు ప్రశ్నలు
- వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌దే అధికారం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



హైదరాబాద్, నవంబర్ 21 (సమయం న్యూస్): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు చెందిన ఫామ్‌హౌస్ భూముల వ్యవహారంపై త్వరలోనే అసెంబ్లీలో కీలక వివరాలు వెల్లడిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. శనివారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ.. ఫామ్‌హౌస్ భూములకు సంబంధించి చేపట్టిన సర్వే దాదాపు పూర్తయిందని చెప్పారు. సర్వే ప్రారంభమైన వెంటనే మాజీ మంత్రి హరీశ్ రావు మామ తన భూముల విషయంలో న్యాయస్థానాన్ని ఆశ్రయించి ముందస్తు స్టే పొందారని వెల్లడించారు. ఈ భూములకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని త్వరలోనే శాసనసభ ద్వారా ప్రజలకు తెలియజేస్తామని పేర్కొన్నారు. మరోవైపు రాష్ట్రంలో భూభారతి (ధరణి) పోర్టల్‌లో నెలకొన్న సాంకేతిక ఇబ్బందులు కూడా దాదాపుగా తొలగిపోయాయని చెప్పారు.

కాళేశ్వరం నిర్మాణంపై కేసీఆర్ వివరణ ఇవ్వాలి

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం పేరుతో కేసీఆర్ ప్రభుత్వం వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని పొంగులేటి ఆరోపించారు. కేంద్రానికి సమర్పించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)లో డయాఫ్రమ్ వాల్ నిర్మిస్తామని పేర్కొన్నప్పటికీ, అనుమతులు లేకుండానే మూడు బ్యారేజీల్లో సిమెంట్ పైల్స్ ఏర్పాటు చేశారని విమర్శించారు. ఈ విధానంలో నిర్మాణాలు చేపట్టడం వల్లే బ్యారేజీలు కుంగిపోయాయని, డయాఫ్రమ్ వాల్ నిర్మాణం జరిగి ఉంటేనే అవి పటిష్ఠంగా ఉండేవని అభిప్రాయపడ్డారు. డీపీఆర్‌లో పేర్కొన్న నిర్మాణ పద్ధతిని పక్కనపెట్టి సిమెంట్ పైల్స్ ఎందుకు వినియోగించారో కేసీఆర్ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వమే

రాష్ట్రంలో వచ్చే ఎన్నికల తర్వాత కూడా కాంగ్రెస్ పార్టీనే అధికార పగ్గాలు చేపడుతుందని పొంగులేటి ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌లో తాను ఎంతో సౌకర్యవంతంగా ఉన్నానని, రాబోయే ఎన్నికలను ఎదుర్కొనే వ్యూహాలు తమ ఐదుగురికి స్పష్టంగా తెలుసని వ్యాఖ్యానించారు. ఎన్నికల రాజకీయాల్లో ఎలా ముందుకెళ్లాలి, ప్రతిపక్షాలను ఏ విధంగా ఎదుర్కోవాలనే అంశాలపై తమకు పూర్తి అవగాహన ఉందన్నారు. సరైన సమయంలో రాజకీయ పోరాటం ప్రారంభించి విజయం సాధిస్తామని, మరోసారి అధికారంలోకి వస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్, బీజేపీ కలిసి ఎన్ని రాజకీయ ఎత్తుగడలు వేసినా ప్రయోజనం ఉండదని స్పష్టం చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్నామనే ధీమాతో బీజేపీ నేతలు రాష్ట్రంలో వ్యవహరిస్తే అది వారికే నష్టమని హెచ్చరించారు. తెలంగాణలో బీజేపీ ప్రభావం తగ్గిపోయిందని, ప్రస్తుతం ఆ పార్టీకి ఉన్న ఎనిమిది మంది ఎమ్మెల్యేలను కాపాడుకోవడమే గొప్ప విషయమని వ్యాఖ్యానించారు.

అగ్రిగోల్డ్ బాధితులకు ఊరట

- బాండ్ల పరిశీలనకు షెడ్యూల్!
- ఈ నెల 25 నుంచి బాండ్లు, రశీదుల ధ్రువీకరణ
- రాష్ట్రవ్యాప్తంగా 10 ప్రత్యేక కేంద్రాల ఏర్పాటు
- రూ.447 కోట్ల కుంభకోణంలో 1.65 లక్షల మంది బాధితులు
- అసలు బాండ్లు, ఆధార్, బ్యాంకు వివరాలతో హాజరుకావాలి
- డిపాజిటర్లు, నామినీలు, చట్టబద్ధ వారసులకు అవకాశం

హైదరాబాద్, నవంబర్ 21 (సమయం న్యూస్): అగ్రిగోల్డ్ బాధితులకు తెలంగాణ నేర పరిశోధన విభాగం (సీఐడీ) కీలక సమాచారం వెల్లడించింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.447 కోట్ల అగ్రిగోల్డ్ కుంభకోణంలో నష్టపోయిన 1.65 లక్షల మంది డిపాజిటర్ల బాండ్లు, రశీదుల పరిశీలనకు షెడ్యూల్ విడుదల చేసింది. ఈ నెల 25 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 10 ప్రత్యేక కేంద్రాల్లో అసలు బాండ్లు, నగదు రశీదుల ధ్రువీకరణ, నమోదు ప్రక్రియ చేపట్టనున్నట్లు సీఐడీ అధికారులు తెలిపారు. ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు వెల్లడించారు. బాధితులు తమ పరిధిలోని కేంద్రాలకు అవసరమైన పత్రాలతో హాజరుకావాలని సూచించారు. డిపాజిటర్ జీవించి ఉన్నట్లయితే అసలు బాండ్ లేదా నగదు రశీదు, స్వీయ ధ్రువీకరణ చేసిన రంగుల నకలు, ఆధార్, పాన్ కార్డుల నకళ్లు, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ స్పష్టంగా కనిపించే బ్యాంకు పాస్‌బుక్ మొదటి పేజీ నకలు, తాజా పాస్‌పోర్టు సైజు ఫొటో, బ్యాంకు ఖాతాకు అనుసంధానమైన మొబైల్ నంబర్ తీసుకురావాలి. ఏజెంట్ వివరాలు తెలిసి ఉంటే వాటిని కూడా అందజేయాలి. డిపాజిటర్ మరణించి నామినీ జీవించి ఉన్నట్లయితే అసలు బాండ్, నామినీ సంతకంతో కూడిన రంగుల నకలు, డిపాజిటర్ మరణ ధ్రువీకరణ పత్రం నకలు, నామినీ ఆధార్, పాన్ కార్డులు, రేషన్ కార్డు లేదా కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం, బ్యాంకు పాస్‌బుక్ మొదటి పేజీ నకలు, తాజా ఫొటో, బ్యాంకు ఖాతాకు అనుసంధానమైన మొబైల్ నంబర్ సమర్పించాలి. డిపాజిటర్, నామినీ ఇద్దరూ మరణించినట్లయితే చట్టబద్ధ వారసుడు లేదా కుటుంబ సభ్యుడు ధ్రువీకరణకు హాజరుకావచ్చు. అసలు బాండ్, వారసుడి సంతకంతో కూడిన రంగుల నకలు, డిపాజిటర్, నామినీ మరణ ధ్రువీకరణ పత్రాలు, వారసుడి ఆధార్, పాన్ కార్డులు, రేషన్ కార్డు లేదా కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం తీసుకురావాలి. సంబంధిత అసలు పత్రాలను అధికారులకు చూపించి నకళ్లు సమర్పించాలి. బ్యాంకు పాస్‌బుక్ మొదటి పేజీ నకలు, తాజా ఫొటో, బ్యాంకుకు అనుసంధానమైన మొబైల్ నంబర్ కూడా అవసరమని సీఐడీ స్పష్టం చేసింది. బాధితులందరూ తమకు సంబంధించిన పత్రాలను ముందుగానే సిద్ధం చేసుకుని నిర్దేశిత కేంద్రాల్లో ధ్రువీకరణ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని సీఐడీ కోరింది. బాండ్ల పరిశీలన ద్వారా బాధితుల వివరాలను నమోదు చేయనున్నారు. అయితే ఈ ప్రక్రియను పరిహారం పంపిణీగా భావించరాదని, నగదు చెల్లింపులకు సంబంధించిన తదుపరి నిర్ణయాల కోసం అధికారిక ప్రకటనలను అనుసరించాలని సూచించింది.

Agri Gold VICTIMS

బాండ్ల ధ్రువీకరణ కేంద్రాలు ఇవే..

హైదరాబాద్:	సెంట్రల్ క్రైమ్ స్టేషన్, హైదరాబాద్ సిటీ పోలీస్ భవనం, బషీర్‌బాగ్.
ఖమ్మం:	ఆర్మ్‌డ్ రిజర్వ్ ప్రధాన కార్యాలయం.
కొత్తగూడెం:	జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ ప్రధాన కార్యాలయం.
వరంగల్:	సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ ప్రధాన కార్యాలయం.
మహబూబ్‌నగర్:	జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ ప్రధాన కార్యాలయం.
నల్గొండ:	జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ ప్రధాన కార్యాలయం.
మంచిర్యాల:	నరూర్ పోలీస్‌స్టేషన్.
కరీంనగర్:	ఆస్త్ర కన్వెన్షన్ హాల్, పోలీస్ కమిషనరేట్ ప్రాంగణం.
నిజామాబాద్:	పోలీస్ ప్రధాన కార్యాలయం.
మెదక్:	జిల్లా పోలీస్ కార్యాలయం.

సీఎం రేవంత్ రెడ్డి తీరుతోనే ఏపీ జల దోపిడీ

నాగార్జున సాగర్ పై ఏపీ అక్రమ ప్రాజెక్టును వారం రోజుల్లో నిలిపివేయించాలి

తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

హైదరాబాద్, నవంబర్ 21 (సమయం న్యూస్): సీఎం రేవంత్ రెడ్డి తీరుతోనే ఏపీ జలదోపిడీకి పాల్పడుతోందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. ఈమేరకు శనివారం వీడియో సందేశం విడుదల చేశారు. ఏపీ సీఎం చంద్రబాబును పిలిచి ప్రజాభవన్ లో కాళ్లు కడిగి గురుదక్షిణగా మన నీళ్లను అప్పగించారని తెలిపారు. రేవంత్ రెడ్డి ఆమోదంతోనే చంద్రబాబు పోలవరం -- బనకచర్ల లింక్ ప్రాజెక్టును చేపట్టారని తెలిపారు. రేవంత్ రెడ్డి అన్ని రకాల ప్రొటోకాల్స్ ను విస్మరించి పని చేస్తున్నారని, ఫలితంగా రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. జలవివాదాలపై అపెక్స్ కౌన్సిల్ సమావేశం కోసం డిమాండ్ చేయకుండా కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ తో అనధికార సమావేశానికి వెళ్లి పోలవరం– బనకచర్లకు ఒప్పుకొని వచ్చారని తెలిపారు. రేవంత్ రెడ్డి అడ్డుకోలేడనే ధైర్యంతోనే ఏపీ ప్రభుత్వం తాగు నీటి పేరుతో నాగార్జున సాగర్ నీళ్లకు గండికొడుతోందన్నారు. తాగునీరు పేరుతో శ్రీశైలం ప్రాజెక్టుపై పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నిర్మించి ఇప్పుడు మొత్తం రిజర్వాయర్ నే మళ్లించుకునే స్థాయిలో పనులు చేసుకున్నారని గుర్తు చేశారు. ఇప్పుడు నాగార్జున సాగర్ పై ఏపీ కన్ను పడిందని, ఇప్పటికే తాగునీటి కోసం 2.8 టీఎంసీలను తీసుకుంటున్న ఏపీ లిఫ్ట్ పేరుతో మరో 1.8 టీఎంసీలను తరలించేందుకు రంగం సిద్ధం చేసిందని అన్నారు. ఏపీ ప్రభుత్వం తొమ్మిది నెలలుగా అక్రమ ప్రాజెక్టు నిర్మిస్తుంటే తెలంగాణ ప్రభుత్వానికి కనీస సమాచారం లేదనే వాదనను ఎలా నమ్మాలని ప్రశ్నించారు. ఎక్కడ ఏం జరిగినా ఇంటెలిజెన్స్ ముఖ్యమంత్రిని అలర్ట్ చేస్తుందని, దురదృష్టవశాత్తు రాష్ట్ర హోం శాఖ బాధ్యతలు కూడా చూస్తున్న రేవంత్ రెడ్డికి ఏపీ అక్రమ ప్రాజెక్టు గురించి తెలియకపోవడం సందేహాలకు తావిస్తోందని అన్నారు. నిజంగానే సమాచారం తెలియదా? తెలిసినా తన సమ్మతితోనే ప్రాజెక్టు చేపట్టింది కాబట్టి మౌనంగా ఉన్నారా అనే విషయంలో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీజేపీకి తెలంగాణ ఓట్లు.. సీట్లు కావాలి తప్ప రాష్ట్ర ప్రయోజనాలు పట్టవా అని ప్రశ్నించారు. అన్ని అంశాలపై స్పందించే ఎంపీ రఘునందన్ రావు, కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి ఏపీ అక్రమ ప్రాజెక్టుపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలు వెంటనే ప్రధాని వద్దకు వెళ్లి ఏపీ అక్రమ ప్రాజెక్టును నిలిపివేయించాలని, ఆ ప్రాజెక్టుకు కేంద్రం 50 శాతం నిధులు జల్ జీవన్ మిషన్ నుంచి ఇవ్వకుండా అడ్డుకోవాలని సూచించారు. వారం రోజుల్లో ఈ ప్రాజెక్టును నిలిపి వేయించకుంటే వేలాదిమంది ప్రజలతో నాగార్జున సాగర్ డ్యాంను ముట్టడిస్తామని, అందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే బాధ్యత వహించాల్సి ఉంటుందని తేల్చిచెప్పారు.



హైదరాబాద్‌లో విచ్చలవిడిగా డ్రగ్స్ సరఫరా!

- మత్తు పదార్థాల బారిన పడుతున్న యువతపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆందోళన
- మూతపడిన పరిశ్రమల్లో డ్రగ్స్ తయారీ.. ఇళ్ల మేడలపై గంజాయి సాగు
- 2029 నాటికి మత్తు పదార్థాల రహిత భారత్ లక్ష్యం
- డ్రగ్స్ కేసులపై శ్వేతపత్రం విడుదల చేయాలి: మహేశ్వర్‌రెడ్డి
- డ్రగ్స్ వ్యతిరేక పోరాటానికి సినీ నటుడు వెంకటేష్ మద్దతు



హైదరాబాద్, నవంబర్ 21 (సమయం న్యూస్): హైదరాబాద్‌లో మత్తు పదార్థాల సరఫరా విచ్చలవిడిగా సాగుతోందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. దేశానికి అతిపెద్ద బలమైన యువత డ్రగ్స్ మహమ్మారి బారిన పడటం తీవ్రంగా కలచివేస్తోందన్నారు. శనివారం హైదరాబాద్‌లోని శ్రీసత్యసాయి నిగమాగమంలో నిర్వహించిన 'సిటీ కన్వెన్షన్ ఆన్ డ్రగ్ ఫ్రీ ఇండియా' సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గతంలో పంజాబ్‌ను మత్తు పదార్థాల సమస్య తీవ్రంగా దెబ్బతీసిందని, ప్రస్తుతం హైదరాబాద్‌లోనూ అలాంటి పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. మూతపడిన పరిశ్రమలను డ్రగ్స్ తయారీ కేంద్రాలుగా మార్చుతున్నారని, కొన్ని ప్రాంతాల్లో ఇళ్ల మేడలపైనే గంజాయి సాగు చేస్తున్న ఘటనలు వెలుగుచూస్తున్నాయని తెలిపారు. మత్తుకు బానిసలైన యువత తమ జీవితాలపై నియంత్రణ కోల్పోతున్నారని కిషన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్స్ నిర్మూలన కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదని, ఐటీ ఉద్యోగులు, యువత, మేధావులు, తల్లిదండ్రులు సహా ప్రతి ఒక్కరూ ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 2029 నాటికి దేశాన్ని మత్తు పదార్థాల రహితంగా తీర్చిదిద్దడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. ఈ సందర్భంగా బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ యువతను మత్తు పదార్థాలకు బానిసలుగా మార్చేందుకు విదేశీ శక్తులు కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో ఇప్పటివరకు నమోదైన డ్రగ్స్ కేసులు, అరెస్టులు, స్వాధీనం చేసుకున్న మత్తు పదార్థాల వివరాలతో ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మత్తు పదార్థాల నిర్మూలనలో రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి పనిచేయాలని కోరారు. మరోవైపు డ్రగ్స్ వ్యతిరేక పోరాటానికి ప్రముఖ సినీ నటుడు విక్టరీ వెంకటేష్ మద్దతు ప్రకటించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 25, 26, 27 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'నషా ముక్త్ భారత్ యాత్ర'లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డితో కలిసి యాత్రకు సంబంధించిన ప్రత్యేక టీషర్టులను వెంకటేష్ ఆవిష్కరించారు. యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న మత్తు పదార్థాలను సమాజం నుంచి తరిమికొట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన 'నషా ముక్త్ యువా ఫర్ వికసిత్ భారత్' పిలుపు, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సంకల్పానికి అనుగుణంగా ఈ యాత్ర నిర్వహిస్తున్నట్లు కిషన్‌రెడ్డి తెలిపారు.

ఏఐ డిటెక్టర్లను నమ్మి విద్యార్థులను శిక్షించొద్దు!

- సాంకేతికత ఇచ్చే ఫలితాలే అంతిమ ఆధారం కాకూడదు
- విద్యలో ఏఐ వినియోగంపై పూర్తిస్థాయి నిషేధం సరికాదు
- భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్

హైదరాబాద్, నవంబర్ 21 (సమయం న్యూస్): కృత్రిమ మేధ (ఏఐ) గుర్తింపు సాఫ్ట్‌వేర్ల ఫలితాలను గుడ్డిగా నమ్మి విద్యార్థులను శిక్షించవద్దని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ విద్యాసంస్థలకు సూచించారు. విద్యార్థులు స్వయంగా రాసిన వ్యాసాలను కూడా ఏఐతో రూపొందించినవిగా గుర్తించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ముఖ్యంగా ఆంగ్లం మాతృభాష కాని విద్యార్థులు ఈ సాంకేతిక లోపాల వల్ల అన్యాయానికి గురయ్యే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన కామన్వెల్త్ లీగల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ తొలి వార్షిక అంతర్జాతీయ న్యాయ విద్యా సదస్సు ప్రారంభోత్సవంలో ఆయన ప్రసంగించారు. 2023లో నిర్వహించిన ఓ అధ్యయనాన్ని ప్రస్తావించిన సీజేఐ.. విస్తృతంగా వినియోగిస్తున్న ఏడు ఏఐ గుర్తింపు సాధనాలు ఆంగ్లం మాతృభాష కాని విద్యార్థులు రాసిన వ్యాసాల్లో ఐదింట మూడింటికి పైగా రచనలను తప్పుగా ఏఐ సృష్టించినవిగా గుర్తించాయని తెలిపారు. కామన్వెల్త్ దేశాల్లో అనేక మంది విద్యార్థులు ఆంగ్లాన్ని రెండో లేదా మూడో భాషగా నేర్చుకుంటున్నారని గుర్తుచేశారు. సాంకేతికత ఇచ్చిన ఒక స్కోరు ఆధారంగా నిజాయితీగా రాసిన విద్యార్థిని మోసగాడిగా ముద్ర వేయడం అన్యాయమన్నారు. విద్యార్థిపై విద్యాపరమైన అక్రమాలకు సంబంధించిన ఆరోపణలు నిర్ధారించేందుకు ఏఐ డిటెక్టర్ ఫలితాన్ని ఒక్కటే ఆధారంగా తీసుకోరాదని స్పష్టం చేశారు. న్యాయ విద్యలో ఏఐ వినియోగాన్ని పూర్తిగా నిషేధించడం ఆచరణ సాధ్యం కాదని జస్టిస్ సూర్యకాంత్ అభిప్రాయపడ్డారు. నిషేధం విధిస్తే విద్యార్థులు రహస్యంగా ఏఐని ఉపయోగించే అవకాశముందని, తద్వారా పర్యవేక్షణ కష్టమవుతుందని పేర్కొన్నారు. పరీక్షలు, అసైన్‌మెంట్లలో ఏఐని ఏ మేరకు ఉపయోగించవచ్చు, ఎప్పుడు దాని వినియోగాన్ని వెల్లడించాలి, ఏ సందర్భాల్లో విద్యార్థి సొంత ఆలోచనకు ప్రాధాన్యం ఇవ్వాలనే అంశాలపై స్పష్టమైన నిబంధనలు రూపొందించాలని సూచించారు. సాంకేతికతను బాధ్యతాయుతంగా ఉపయోగించేలా విద్యార్థులకు అవగాహన కల్పించాలని కోరారు. న్యాయ విద్యార్థుల మూల్యాంకన విధానంలోనూ మార్పులు అవసరమని సీజేఐ పేర్కొన్నారు. న్యాయవాదుల వద్ద శిక్షణ పొందకుండానే ఇంటర్న్‌షిప్ ధ్రువపత్రాలు ఇవ్వడం, చేయని పనులకు మార్కులు కేటాయించడం సరికాదన్నారు. ప్రతి న్యాయ విద్యార్థి డిగ్రీ పూర్తిచేసేలోపు నిర్ణీత కాలం ఉచిత న్యాయ సహాయ సేవల్లో పాల్గొనడాన్ని తప్పనిసరి చేయాలని ప్రతిపాదించారు. నిర్ణీత సమయానికి మించి సేవలందించే వారికి అదనపు క్రెడిట్లు ఇవ్వాలని సూచించారు. సెమిస్టర్ సెలవుల్లోనూ న్యాయ సహాయ కేంద్రాలు పనిచేయాలని, వాటిని న్యాయవాదుల నిరంతర విద్యా కేంద్రాలుగా అభివృద్ధి చేయవచ్చని జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు.



చరిత్రకు సాక్షులు ఫోటో జర్నలిస్టులు



- వార్తల కన్నా ఫొటోలోనే ఆకర్షణ శక్తి ఎక్కువ
- శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్



సమయం న్యూస్, హైదరాబాద్: పత్రికల్లో ప్రచురితమయ్యే వార్తల కన్నా, ఫొటోలోనే ఎక్కువ ఆకర్షణ శక్తి ఉంటుందని, ఫోటో క్షణాల్లోనే వేల భావాలను ప్రజల హృదయాల్లోకి తీసుకెళ్లగలగుతుందని తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. శనివారం నాడు బషీర్ బాగ్‌లోని సురవరం ప్రతాప్ రెడ్డి ఆడిటోరియంలో తెలంగాణ ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ నిర్వహించిన ఉత్తమ ఫోటో జర్నలిస్టుల అవార్డుల ప్రదానోత్సవ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. చదివిన వార్తను పాఠకులు మరిచిపోవచ్చు కానీ మనసును కదిలించే ఫోటో మాత్రం జీవితాంతం గుర్తుండిపోతుందని స్పీకర్ తెలిపారు. అందుకే ఫోటో అంటే కేవలం దృశ్యం మాత్రమే కాదని, అది ఒక చరిత్ర అని ఆయన స్పష్టం చేసారు. స్వాతంత్ర్య పోరాటం నుంచి ప్రజాస్వామ్య ఉద్యమాల వరకు, ప్రకృతి వైపరీత్యాల నుంచి యుద్ధాల వరకు, పేదరికం నుంచి సామాజిక వివక్ష వరకు.. ప్రపంచ చరిత్రలో ఎన్నో కీలక ఘట్టాలను మన కళ్ల ముందు నిలిపింది ఫోటో జర్నలిజమేనని ప్రసాద్ కుమార్ కొనియాడారు. ఒక పేద తల్లి కన్నీటిని, ఆకలితో అలమటిస్తున్న చిన్నారి పరిస్థితిని, అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజల ఆవేదనను, ప్రజల కోసం పోరాడుతున్న ఉద్యమకారుల తెగువను ప్రపంచానికి పరిచయం చేసేది ఫోటో జర్నలిస్టు కెమెరానే అని ఆయన అన్నారు. ఒక ఫోటో ప్రభుత్వాన్ని ఆలోచింపజేస్తుందని,

ఒక ఫోటో అధికార వ్యవస్థను ప్రశ్నిస్తుందని, ఒక ఫోటో ప్రజా ఉద్యమానికి ప్రేరణగా నిలుస్తుందని, ఒక ఫోటో సమాజంలో మార్పుకు నాంది కావచ్చని ఆయన అన్నారు.

అందుకే ఫోటో జర్నలిస్టు కెమెరా ఎప్పుడూ నిజం వైపు గురిపెట్టాలని, వారి ఆలోచన ఎప్పుడూ ప్రజల పక్షాన ఉండాలని, వృత్తి నిబద్ధత ఎప్పుడూ జర్నలిజం విలువలను కాపాడాలని స్పీకర్ కోరారు. ఫోటో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తనవంతు సహకారం ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, నేటి డిజిటల్ యుగంలో మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా, డిజిటల్ కెమెరాలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి సాంకేతిక పరిజ్ఞానం ఫోటో జర్నలిజంలో అనేక మార్పులు తీసుకువచ్చిందని, క్షణాల్లోనే ప్రపంచవ్యాప్తంగా ఫోటోను చేరవేయగలుగుతున్న ఒక గొప్ప అవకాశం ఏర్పడడం మంచి పరిణామమే అయినప్పటికీ, ఇది ఒక పెద్ద సవాలు కూడా అని ఆయన అన్నారు. మార్ఫింగ్, ఫేక్ ఫోటోలు, ఏఐ సృష్టించిన దృశ్యాలు, తప్పుడు సమాచారంతో కూడిన చిత్రాలు సమాజాన్ని తప్పుదారి పట్టించే ప్రమాదం ఉందన్నారు. ఈ పరిస్థితుల్లో ఫోటో జర్నలిస్టులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి. ఇలాంటి పరిస్థితుల్లో ఫోటో జర్నలిస్టులు వృత్తి నైతికతను ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోకూడదని ఆయన సూచించారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ మాట్లాడుతూ, ఫోటో జర్నలిస్టు మీడియా సంస్థలో ఉద్యోగి మాత్రమే కాదని, అతను కాలానికి సాక్షి, చరిత్రలో సైనికుడని అభివర్ణించారు.

సమాజంలో సంఘర్షణతో కూడుకున్న వృత్తుల్లో ఫోటో జర్నలిజం ఒకటని ఆయన అన్నారు. అసలే కత్తిమీద సాములాంటి జర్నలిజం వృత్తిలో ఫోటో జర్నలిస్టుల కష్టాలు వర్ణనాతీతమన్నారు. విధినిర్వహణలో కష్టాలు, కుటుంబ పోషణలో కష్టాలను ఫోటో జర్నలిస్టులు అనుభవిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేసారు. ఫోటో జర్నలిస్టులకు తమ సంఘం అండగా నిలబడి, వారి సంక్షేమం కోసం నిరంతరం పోరాడుతున్నట్లు విరాహత్ అలీ అన్నారు. ఇంకా ఈ సభలో ఐజేయు స్టీరింగ్ కమిటీ సభ్యులు దేవులపల్లి అమర్, జాతీయ కార్యదర్శి వై. నరేందర్ రెడ్డి, టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కల్కూరి రాములు, రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగాధర్, కె.ఎన్.హరి తదితరులు పాల్గొని ప్రసంగించారు. అనంతరం ఉత్తమ ఫోటో జర్నలిస్టులను స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సత్కరించి, అవార్డులు అందజేశారు.



తుపాకులు కొనుక్కోండి!

హిందువులకు గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ వివాదాస్పద పిలుపు

భవిష్యత్తులో హిందువుల భద్రతకు ముప్పు ఉందంటూ వ్యాఖ్యలు

ముస్లిం జనాభా పెరుగుదలను ప్రస్తావించిన ఎమ్మెల్యే

హైదరాబాద్, నవంబర్ 21 (సమయం న్యూస్): భవిష్యత్తులో దేశంలోని హిందువుల భద్రతకు ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందని, అందువల్ల ప్రతి హిందువు ఆత్మరక్షణ కోసం తుపాకీ సమకూర్చుకోవాలని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. చట్టబద్ధంగా అనుమతులు పొంది లైసెన్స్‌డ్ తుపాకులను కొనుగోలు చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో ఎదురయ్యే పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఇప్పటి నుంచే సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ మేరకు ఆయన మాట్లాడినట్లు ప్రచారంలో ఉన్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారడంతో తీవ్ర చర్చకు దారితీసింది. ప్రపంచవ్యాప్తంగా ముస్లింల జనాభా వేగంగా పెరుగుతోందని రాజాసింగ్ పేర్కొన్నారు. ఈ పరిణామం భవిష్యత్తులో హిందువుల ఉనికికి, భద్రతకు సవాలుగా మారవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. అనుకోని పరిస్థితులు ఎదురైతే ప్రజలు తమను తాము ఎలా రక్షించుకుంటారని ప్రశ్నించారు. ప్రతి ఒక్కరూ ఆత్మరక్షణ పద్ధతులను నేర్చుకోవడంతోపాటు చట్టబద్ధంగా ఆయుధ లైసెన్సులు పొందాలని సూచించారు. అయితే మతపరమైన జనాభా పెరుగుదల వల్ల ఒక వర్గానికి భద్రతా ముప్పు ఏర్పడుతుందనే ఆయన వాదనకు నిర్దిష్ట ఆధారాలను వెల్లడించలేదు. రాజాసింగ్ వ్యాఖ్యలపై సామాజిక మాధ్యమాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ఆయన పిలుపును ఆత్మరక్షణకు సంబంధించిన సూచనగా సమర్థిస్తుండగా, మరికొందరు మతపరమైన అంశాలను ప్రస్తావిస్తూ ఆయుధాలు కొనుగోలు చేయాలని పిలుపునివ్వడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు సామాజిక సామరస్యాన్ని కాపాడేలా వ్యవహరించాలనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. భారతదేశంలో తుపాకుల కొనుగోలు, కలిగి ఉండటం ఆయుధ చట్టం ప్రకారం అనుమతులు, నిబంధనలకు లోబడి ఉంటుందని న్యాయ నిపుణులు గుర్తుచేస్తున్నారు. ఈ నేపథ్యంలో రాజాసింగ్ వ్యాఖ్యలు రాజకీయ, సామాజిక వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

పుష్కర పనులు గడువులోపు పూర్తి కావాలి

సంబంధిత శాఖలు చర్యలు తీసుకోవాలి

అధికారులకు సీఎస్ సంజయ్ జాజు ఆదేశాలు

హైదరాబాద్, నవంబర్ 21 : ప్రతిష్ఠాత్మకమైన గోదావరి పుష్కరాలకు సంబంధించిన ఇంజినీరింగ్, మౌలిక సదుపాయాల పనులన్నింటినీ నిర్ణీత గడువు లోపు పూర్తి చేసేలా సంబంధిత శాఖలన్నీ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. పుష్కరాల సందర్భంగా రాష్ట్రానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున అందుకు అనుగుణంగా ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. పుష్కరాల ఏర్పాట్లు, సన్నద్ధతపై అన్ని సంబంధిత శాఖల అధికారులతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పుష్కరాల కోసం చేపడుతున్న ఏర్పాట్లు, కార్యాచరణపై అధికారులు సమగ్ర పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. 2027 జూన్ 26 నుంచి జూలై 7 వరకు జరగనున్న గోదావరి పుష్కరాలకు సుమారు ఎనిమిది కోట్ల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వివరించారు. పుష్కరాలకు సంబంధించిన పనులకు ప్రాధాన్యతనిస్తూ పుష్కరాలు ప్రారంభమయ్యే నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు తదితర అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ ఎగుమతుల్లో మూడేళ్లలో 68 శాతం వృద్ధి

తయారీ రంగానికి ప్రభుత్వ ప్రోత్సాహం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 21: తెలంగాణ నుంచి వస్తువుల ఎగుమతులు గత మూడేళ్లలో 68 శాతం పెరిగాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ప్రజా ప్రభుత్వం కల్పిస్తున్న ప్రోత్సాహకాలు, అనుకూల విధానాల కారణంగానే తయారీ రంగంతో పాటు ఎగుమతుల్లోనూ గణనీయమైన వృద్ధి నమోదవుతోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో వ్యాపారాలకు అనుకూలమైన వాతావరణం, పారదర్శక పాలన కొనసాగుతున్నాయనడానికి ఈ పురోగతి నిదర్శనమని ఆయన తెలిపారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ట్వీట్ చేశారు. ఏరోస్పేస్, ఇంజినీరింగ్ రంగాల నుంచి ఎగుమతులు గణనీయంగా పెరుగుతున్నాయని సీఎం వివరించారు. అభివృద్ధి హైదరాబాద్‌కే పరిమితం కాకుండా మహబూబ్‌నగర్ వంటి జిల్లాలకూ విస్తరిస్తుండటం సానుకూల పరిణామమని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో పారిశ్రామిక, ఆర్థిక కార్యకలాపాలు ఊపందుకుంటున్నాయని తెలిపారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌లో భాగంగా అమలు చేయనున్న క్యూర్--ప్యూర్--రేర్ విధానం రాష్ట్ర ఆర్థిక ప్రగతికి మరింత ఊతమిస్తుందని రేవంత్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ వ్యూహంతో పెట్టుబడులు, పరిశ్రమలు, ఎగుమతులకు కొత్త అవకాశాలు ఏర్పడతాయని పేర్కొన్నారు. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దడం లక్ష్యమని సీఎం ధీమా వ్యక్తం చేశారు.





జేఈఈ మెయిన్ దరఖాస్తులకు
నేడే ఆఖరి గడువు!

నేడు అర్ధరాత్రి వరకు దరఖాస్తులకు అవకాశం

ఇప్పటివరకు 13.29 లక్షల మంది అభ్యర్థుల నమోదు

రూ.500 ఆలస్య రుసుముతో నవంబర్ 26 వరకు అవకాశం

జనవరి 20 నుంచి తొలి విడత పరీక్షలు

న్యూఢిల్లీ, నవంబర్ 22 (సమయం న్యూస్): జేఈఈ మెయిన్ పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు నేటితో ముగియనుంది. నవంబర్ 22 అర్ధరాత్రి వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ) వెల్లడించింది. అభ్యర్థులు చివరి నిమిషం వరకు వేచి చూడకుండా దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించింది. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 13.29 లక్షల మంది అభ్యర్థులు నమోదు చేసుకోగా, వారిలో 11.19 లక్షల మందికిపైగా రుసుము చెల్లించి దరఖాస్తులను విజయవంతంగా సమర్పించినట్లు తెలిపింది. దరఖాస్తు నమోదు చేసుకోవడంతోనే ప్రక్రియ పూర్తయినట్లు కాదని, నిర్ణీత రుసుము చెల్లించి నిర్ధారణ పత్రాన్ని డౌన్‌లోడ్ చేసుకోవాలని ఎన్‌టీఏ స్పష్టం చేసింది. ఎవరూ తమ దరఖాస్తులను అసంపూర్తిగా వదిలేయవద్దని సూచించింది. సాధారణ గడువులోగా దరఖాస్తు చేసుకోలేని అభ్యర్థులకు రూ.500 ఆలస్య రుసుముతో నవంబర్ 26 వరకు అవకాశం కల్పించినట్లు పేర్కొంది. జేఈఈ మెయిన్ తొలి విడత పరీక్షలను జనవరి 20, 21, 22, 23, 24, 28 తేదీల్లో నిర్వహించనున్నారు. కంప్యూటర్ ఆధారిత విధానంలో ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా పరీక్షలు జరగనున్నాయి. పరీక్షల షెడ్యూల్, దరఖాస్తులు, ఇతర తాజా సమాచారం కోసం అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ https://jeemain.nta.nic.in/ను సందర్శించాలని ఎన్‌టీఏ సూచించింది. సందేహాల నివృత్తికి 011-40759000, 1800-180-4747 నంబర్లలో లేదా jeemain@nta.ac.in ద్వారా సంప్రదించవచ్చని తెలిపింది.

పెళ్లిళ్లు చేసుకోండి..
ఎక్కువ మంది పిల్లలను కనండి!

అమెరికా యువతకు కరోలిన్ లీవిట్ పిలుపు

ఇస్లాం జనాభా వేగంగా పెరుగుతోందంటూ నివేదిక ప్రస్తావన

జీవన వ్యయం పెరుగుతుంటే పిల్లల పోషణ ఎలా అంటూ నెటిజన్ల ప్రశ్నలు



వాషింగ్టన్, నవంబర్ 22 (సమయం న్యూస్): అమెరికా యువత పెళ్లిళ్లు చేసుకుని ఎక్కువ మంది పిల్లలను కనాలని వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీగా పనిచేసిన కరోలిన్ లీవిట్ పిలుపునిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా మతాల వారీగా జనాభా పెరుగుదలపై వెలువడిన నివేదిక నేపథ్యంలో ఆమె చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. క్రైస్తవులతో పోలిస్తే ముస్లిం జనాభా వేగంగా పెరుగుతోందని పేర్కొంటూ, అమెరికా యువత కుటుంబ వ్యవస్థకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పిల్లల్లో దేశం పట్ల ప్రేమను పెంపొందించాలని కోరారు. ప్రపంచంలో ఇస్లాం, క్రైస్తవ మతాల జనాభా పెరుగుదలపై ప్యూ పరిశోధనా కేంద్రం అంచనాలను ప్రస్తావిస్తూ వాషింగ్టన్ పోస్ట్‌లో వచ్చిన కథనంపై లీవిట్ స్పందించారు. రానున్న కాలంలో ముస్లిం జనాభా మరింత వేగంగా పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అమెరికా యువత వివాహాలు చేసుకుని పెద్ద కుటుంబాలను ఏర్పరచుకోవాలని సూచించారు. అయితే 2035 నాటికే ఇస్లాం ప్రపంచంలో అతిపెద్ద మతంగా అవతరిస్తుందనే ప్రచారానికి ప్యూ పరిశోధనా కేంద్రం అంచనాలతో స్పష్టమైన ఆధారం లేదు. ఆ సంస్థ గత అంచనాల ప్రకారం క్రైస్తవులు, ముస్లింల జనాభా సంఖ్యలు ఈ శతాబ్దం మధ్యకాలం తర్వాత మరింత దగ్గరయ్యే అవకాశముంది. మరోవైపు లీవిట్ వ్యాఖ్యలపై సామాజిక మాధ్యమాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ఆమె సూచనలను సమర్థిస్తుండగా, మరికొందరు అమెరికాలో పెరుగుతున్న జీవన వ్యయం, గృహ ఖర్చులు, పిల్లల విద్య, వైద్య అవసరాలను ప్రస్తావిస్తున్నారు. ఆర్థిక ఒత్తిళ్ల కారణంగా యువ దంపతులు ఎక్కువ మంది పిల్లలను కనడానికి వెనుకాడుతున్నారని అభిప్రాయపడుతున్నారు. కుటుంబాల ఆర్థిక భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టకుండా జనాభా పెంపుపై పిలుపునివ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. దీంతో లీవిట్ వ్యాఖ్యలు అమెరికాలో కుటుంబ వ్యవస్థ, జనాభా పెరుగుదల, జీవన వ్యయంపై కొత్త చర్చకు దారితీశాయి.

చెత్త వేసినా, కాల్చినా భారీ జరిమానా

న్యూఢిల్లీ, నవంబర్ 22 (సమయం న్యూస్): దేశ రాజధాని ఢిల్లీలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడంతోపాటు పర్యావరణ కాలుష్యాన్ని అరికట్టేందుకు ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (ఎంసీడీ) కఠిన చర్యలకు సిద్ధమైంది. బహిరంగ ప్రదేశాల్లో చెత్తను కాల్చేవారికి రూ. 10 వేల జరిమానా విధించనున్నది. రోడ్లు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసే వారికి రూ. 1,000 జరిమానా విధించాలని నిర్ణయించింది. ప్రతి ఇంటి వద్ద తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి మున్సిపల్ సిబ్బందికి అందించడం తప్పనిసరి చేయనున్నారు. ఈ నిబంధనను ఉల్లంఘిస్తే రూ. 500 జరిమానా విధిస్తారు. నిబంధనలు పాటించని హోటళ్లకు రూ. 75 వేలు, రెస్టారెంట్లకు రూ. 30 వేల వరకు జరిమానా విధించేలా ప్రతిపాదనలు రూపొందించారు. భారీగా వ్యర్థాలను ఉత్పత్తి చేసే సంస్థలు వాటి నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకోవాల్సి ఉంటుంది. ప్లాస్టిక్, ఇతర ప్యాకేజింగ్ వ్యర్థాల నియంత్రణపైనా ఎంసీడీ ప్రత్యేక దృష్టి సారించింది. తమ ఉత్పత్తుల ద్వారా వెలువడే ప్యాకేజింగ్ వ్యర్థాలను తిరిగి సేకరించేందుకు తగిన వ్యవస్థ ఏర్పాటు చేయని తయారీదారులు, బ్రాండ్ యజమానులకు గరిష్ఠంగా రూ. 1.5 లక్షల జరిమానా విధించాలని నిర్ణయించింది. అంతేకాకుండా జరిమానా మొత్తాలను ప్రతి ఏడాది 5 శాతం చొప్పున పెంచాలని స్థాయీ సంఘం తీర్మానించింది. ప్రజలు, వ్యాపార సంస్థల్లో పారిశుద్ధ్య బాధ్యతను పెంపొందించడం, నగరంలో చెత్త సమస్యను నియంత్రించడం, వాయు కాలుష్యాన్ని తగ్గించడమే ఈ చర్యల ప్రధాన ఉద్దేశమని అధికారులు పేర్కొంటున్నారు. కొత్త నిబంధనల అమలుకు సంబంధించిన తదుపరి అధికారిక ప్రక్రియ పూర్తయిన తర్వాత జరిమానాలు అమల్లోకి రానున్నాయి.

గంగానదిపై 'నితీశ్ సేతు' ప్రారంభం

- ఆరు వరుసల భారీ వంతెనను జాతికి అంకితం చేసిన ప్రధాని మోదీ
- పాట్నా-వైశాలి మధ్య మరింత సులభతరం కానున్న రాకపోకలు
- బిహార్‌లో రూ.34,470 కోట్ల అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం
- రహదారులు, విద్యుత్, సాగునీటి రంగాలకు భారీ ప్రోత్సాహం
- స్వావలంబన బిహార్ నిర్మాణమే లక్ష్యమన్న ప్రధాని



వైశాలి, నవంబర్ 21 (సమయం న్యూస్): బిహార్‌లోని వైశాలి జిల్లాలో గంగానదిపై నిర్మించిన ఆరు లైన్ల దర్గా-బిదుపూర్ కేబుల్ వంతెన 'నితీశ్ సేతు'ను ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ప్రారంభించి జాతికి అంకితం చేశారు. మాజీ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ గౌరవార్థం ఈ వంతెనకు 'నితీశ్ సేతు'గా నామకరణం చేశారు. సుమారు రూ.4,280 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ప్రాజెక్టులో భాగంగా ప్రధాన వంతెన పొడవు సుమారు 9.76 కిలోమీటర్లు కాగా, అప్రోచ్ రోడ్లతో కలిపి మొత్తం కనెక్టివిటీ ప్రాజెక్టు 19.7 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. పట్నా జిల్లాలోని కచ్చీ దర్గా (ఎన్‌హెచ్-22)ను వైశాలి జిల్లాలోని బిదుపూర్ (ఎన్‌హెచ్-322)తో ఈ వంతెన కలుపుతుంది. ప్రారంభోత్సవానికి ముందు పట్నా విమానాశ్రయంలో మాజీ సీఎం నీతీశ్ కుమార్‌ను ప్రధాని మోదీ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో బిహార్ ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి, కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ తదితరులు పాల్గొన్నారు. 'నితీశ్ సేతు' ప్రారంభంతో పట్నా, వైశాలి మధ్య ప్రయాణ దూరం, సమయం గణనీయంగా తగ్గనున్నాయి. ఇప్పటికే ఉన్న మహాత్మా గాంధీ సేతు, జేపీ సేతుపై రవాణా భారాన్ని ఇది తగ్గిస్తుంది. గంగానది మధ్యలో ఉండి రవాణా ఇబ్బందులు ఎదుర్కొనే వైశాలి జిల్లాలోని రాఘోపూర్ దియారా ప్రాంత ప్రజలకు పట్నాలోని ఆసుపత్రులు, విద్యాసంస్థలు, ఇతర అత్యవసర సేవలకు చేరుకోవడం మరింత సులభతరం అవుతుంది. ఉత్తర బిహార్‌లోని రైతులకు, వ్యాపారవేత్తలకు ప్రధాన మార్కెట్లకు వేగంగా చేరుకునే మార్గం లభించడంతో పాటు లీచీ, అరటి, మొక్కజొన్న, కూరగాయలు వంటి వ్యవసాయ ఉత్పత్తుల రవాణా మెరుగుపడుతుందని అధికార వర్గాలు పేర్కొన్నాయి. అలాగే ఈ కారిడార్ లాజిస్టిక్స్, పర్యాటక, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి దోహదపడుతుందని అంచనా వేస్తున్నారు. 'నితీశ్ సేతు' నామకరణం, ప్రారంభోత్సవం నేపథ్యంలో అధికార ఎన్డీయే కూటమి, ప్రతిపక్ష ఆర్జేడీ మధ్య రాజకీయ మాటల తూటాలు పేలాయి. 2012లో నీతీశ్ కుమార్ సీఎంగా ఉన్నప్పుడు ఈ ప్రాజెక్టుకు రూపకల్పన జరిగిందని, రాష్ట్ర అభివృద్ధికి ఆయన చేసిన కృషికి గుర్తింపుగా ఈ పేరు పెట్టారని ఎన్డీయే నేతలు సమర్థించారు. మరోవైపు, వంతెన పేరు, క్రెడిట్ విషయంపై ప్రతిపక్షం నుంచి విమర్శలు రాగా.. భాజపా, జేడీ(యూ) నేతలు వాటిని తిప్పికొట్టారు. బిహార్ సమగ్రాభివృద్ధి లక్ష్యంగా సుమారు రూ.34,470 కోట్ల విలువైన ఇతర అభివృద్ధి ప్రాజెక్టులను కూడా ప్రధాని మోదీ ఈ పర్యటనలో ప్రారంభించి, శంకుస్థాపనలు చేశారు.

భారత్ ఎదుగుదలను అడ్డుకునేందుకు చైనా కుట్రలు

ఆపరేషన్ సిందూర్‌లో పాక్‌కు బీజింగ్ సాయం

కీలక పరిశ్రమల సరఫరా వ్యవస్థపై నియంత్రణ

భారత్‌తో సహకారం పెంచుకోవాలని అమెరికాకు సూచన



న్యూఢిల్లీ, నవంబర్ 21 (సమయం న్యూస్): భారత్ ఎదుగుదలను అడ్డుకునేందుకు చైనా సైనిక, ఆర్థిక వ్యూహాలను అమలు చేస్తోందని అమెరికా కాంగ్రెస్‌కు చెందిన యూఎస్-చైనా ఎకనామిక్ అండ్ సెక్యూరిటీ రివ్యూ కమిషన్ తన తాజా నివేదికలో వెల్లడించింది. 2025 మేలో జరిగిన ఆపరేషన్ సిందూర్ సందర్భంగా పాకిస్తాన్‌కు చైనా మద్దతు అందించిందని పేర్కొంది. సరిహద్దుల్లో ఒత్తిడి పెంచడంతోపాటు, కీలక పారిశ్రామిక ముడి పదార్థాలు, పరికరాల సరఫరాపై ఆంక్షలతో భారత్‌ను నియంత్రించాలని చూస్తోందని తెలిపింది. భారత్-పాక్ మధ్య మూడు రోజులపాటు జరిగిన సైనిక ఘర్షణలో చైనా ప్రత్యక్షంగా పాల్గొనకుండానే పాకిస్తాన్‌కు సాంకేతిక సహకారం అందించిందని నివేదిక పేర్కొంది. చైనా ఇంజినీర్ జాంగ్ హెంగ్ కూడా పాక్ వైమానిక దళానికి సాంకేతిక సాయం అందించిన బృందంలో తాను ఉన్నట్లు ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. జే-10సీఈ యుద్ధవిమానాలు పూర్తి సామర్థ్యంతో పనిచేసేలా తమ బృందం సహకరించిందని తెలిపారు. హిందూ మహాసముద్రంలోనూ నౌకాదళ ఉనికి, నిఘా కార్యకలాపాలను చైనా పెంచుతోందని కమిషన్ హెచ్చరించింది. పారిశ్రామిక ముడి పదార్థాలు, సాంకేతికతపై నియంత్రణతో భారత్ పోటీ సామర్థ్యాన్ని తగ్గించాలని చైనా ప్రయత్నిస్తోందని నివేదిక తెలిపింది. కీలక ఉత్పత్తుల ఎగుమతులను పరిమితం చేయడం, ఇంజినీర్లను వెనక్కి పిలిపించడం, ఎలక్ట్రానిక్స్ తయారీకి అవసరమైన పరికరాల సరఫరాలో ఆటంకాలు సృష్టించడం వంటి చర్యలను ప్రస్తావించింది. ఆసియాలో శక్తుల సమతౌల్యాన్ని ప్రభావితం చేయగల సామర్థ్యం భారత్‌కు ఉందని కమిషన్ పేర్కొంది. చైనా తయారీ, సరఫరా వ్యవస్థలకు ప్రత్యామ్నాయంగా ఎదిగే అవకాశం భారత్‌కు ఉందని తెలిపింది. ఇప్పటికే భారత్ సైనిక సామర్థ్యాన్ని ఆధునీకరిస్తూ, దేశీయ తయారీని ప్రోత్సహిస్తోందని వివరించింది. అయితే పరిశ్రమలు చైనా యంత్రాలు, విడిభాగాలపై ఆధారపడటం సవాలుగా మారిందని అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో నిఘా సమాచారం, రక్షణ సాంకేతికత, సరఫరా వ్యవస్థలు, సముద్ర భద్రత రంగాల్లో భారత్‌తో అమెరికా సహకారాన్ని మరింత విస్తరించాలని సిఫారసు చేసింది.

తాజ్‌మహల్ సందర్శనకు
పాక్ మంత్రికి గ్రీన్‌సిగ్నల్!

ముసాదిక్ మాలిక్‌కు కేంద్ర ప్రభుత్వం అనుమతి

నిజాముద్దీన్ దర్గా సందర్శనకు మాత్రం నిరాకరణ



న్యూఢిల్లీ, నవంబర్ 21 (సమయం న్యూస్): భారత్‌లో పర్యటిస్తున్న పాకిస్తాన్ వాతావరణ మార్పుల శాఖ మంత్రి ముసాదిక్ మాలిక్‌కు ఆగ్రాలోని చారిత్రక తాజ్‌మహల్‌ను సందర్శించేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అయితే ఢిల్లీలోని ప్రసిద్ధ నిజాముద్దీన్ దర్గాను సందర్శించేందుకు మాత్రం అనుమతి నిరాకరించింది. షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నాగరికతల సంభాషణల సదస్సులో పాల్గొనేందుకు మాలిక్ భారత్‌కు వచ్చిన విషయం తెలిసిందే. ఈ పర్యటనలో భాగంగా తాజ్‌మహల్, నిజాముద్దీన్ దర్గాను సందర్శించేందుకు ఆయన తొలుత అనుమతి కోరగా కేంద్రం నిరాకరించింది. తాజాగా తాజ్‌మహల్‌తోపాటు హుమాయున్ సమాధి, ఢిల్లీ హాట్ సహా పలు చారిత్రక ప్రాంతాల సందర్శనకు అనుమతులు మంజూరు చేసింది. దీంతో మాలిక్ నేతృత్వంలోని పాకిస్తాన్ బృందం ఆయా ప్రాంతాలను సందర్శించనుంది. గతంలో సింధూ జలాల ఒప్పందంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన ముసాదిక్ మాలిక్ భారత్ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. గత మూడేళ్లలో భారత్‌లో పర్యటిస్తున్న తొలి పాకిస్తాన్ మంత్రిగా ఆయన నిలిచారు. శుక్రవారం ఎస్‌సీఓ సదస్సు ప్రారంభమైన అనంతరం మీడియాతో మాట్లాడిన మాలిక్.. శాంతి, భద్రతను పెంపొందించేందుకు చేపట్టే అన్ని ప్రయత్నాలకు పాకిస్తాన్ మద్దతు ఇస్తుందని పేర్కొన్నారు. భారత్, పాకిస్తాన్ మధ్య భవిష్యత్తులో పరస్పర పర్యటనలు కొనసాగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎస్‌సీఓ సభ్య దేశాల మధ్య సంబంధాలను మరింత మెరుగుపరచుకోవాల్సిన అవసరం ఉందని మాలిక్ అభిప్రాయపడ్డారు. ప్రాంతీయ శాంతి, సహకారం కోసం సభ్య దేశాలన్నీ సమష్టిగా కృషి చేయాలని కోరారు. అయితే పాక్ మంత్రికి కొన్ని చారిత్రక ప్రాంతాల సందర్శనకు అనుమతి ఇచ్చి, నిజాముద్దీన్ దర్గాకు నిరాకరించడం చర్చనీయాంశమైంది. ఈ నిర్ణయానికి సంబంధించిన కారణాలను కేంద్ర ప్రభుత్వం వెల్లడించాల్సి ఉంది.

రాహుల్ వ్యాఖ్యలకు కిరణ్ రిజిజు కౌంటర్..

1962 చైనా యుద్ధంపై క్షమాపణ చెబుతారా?

దేశాన్ని పేదరికంలో ఎందుకు ఉంచారు?

భారత్ ప్రతిష్ఠను ఎందుకు తగ్గించారు?

మోదీని 'రాజీ పడిన ప్రధాని' అన్న రాహుల్



న్యూ ఢిల్లీ, నవంబర్ 21 (సమయం న్యూస్): ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ చేసిన విమర్శలకు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఘాటుగా బదులిచ్చారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య జరిగిన త్రైపాక్షిక సమావేశంలో భారత్‌కు ప్రాతినిధ్యం లేకపోవడంపై రాహుల్ చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సమాధానం చెప్పాల్సిన నాలుగు ప్రశ్నలను సంధించారు. శనివారం ఎక్స్ వేదికగా స్పందించిన రిజిజు.. 1962లో చైనా చేతిలో భారత్ ఎదుర్కొన్న పరాజయానికి కాంగ్రెస్ క్షమాపణ చెబుతుందా అని ప్రశ్నించారు. చైనా ఆక్రమణకు గురైన ప్రాంతంలో తన గ్రామం కూడా ఉందని పేర్కొన్నారు. దేశాన్ని ఇన్నేళ్లపాటు పేదరికంలో ఎందుకు ఉంచారని, భారత్‌ను 'పాములు ఆడించే దేశం'గా ప్రపంచానికి ఎందుకు పరిచయం చేశారని నిలదీశారు. భారత ఆర్థిక వ్యవస్థను 'హిందూ వృద్ధి రేటు'గా అభివర్ణిస్తూ అభివృద్ధిని తక్కువ చేసి చూపించడంపై కూడా కాంగ్రెస్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. చైనాలో జరిగిన ఏపీఈసీ సదస్సు సందర్భంగా ట్రంప్, షీ జిన్‌పింగ్, పుతిన్ మధ్య జరిగిన త్రైపాక్షిక సమావేశంపై రాహుల్ గాంధీ స్పందించారు. కాంగ్రెస్ అధికారంలో ఉండి ఉంటే భారత ప్రధానమంత్రి కూడా ఆ సమావేశంలో పాల్గొనేవారని వ్యాఖ్యానించారు. 'రాజీ పడిన ప్రధానమంత్రి ఎప్పటికీ ఆ సమావేశంలో కూర్చోలేరు' అంటూ మోదీని ఉద్దేశించి ఎక్స్‌లో పోస్టు చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడిన రిజిజు.. భారత్‌కు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయడం రాహుల్ గాంధీ మానుకోవాలని సూచించారు. దేశంలో ఉన్నా, విదేశీ పర్యటనల్లో ఉన్నా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. విదేశాల్లోని భారత్ వ్యతిరేక శక్తులతో రాహుల్ కలిసి పనిచేస్తున్నారని ఆరోపించారు. భారత ప్రజాస్వామ్యం, ఆర్థిక వ్యవస్థపై అసత్య ప్రచారం చేస్తున్నారని, దేశ నాగరికత, సంప్రదాయాలు, రాజ్యాంగాన్ని బలహీనపరిచేలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాహుల్ వ్యాఖ్యలతో బీజేపీ, కాంగ్రెస్ నేతల మధ్య మాటల యుద్ధం మొదలైంది. అంతర్జాతీయ పరిణామాలపై రాహుల్‌కు అవగాహన లేదంటూ బీజేపీ నేతలు విమర్శలు గుప్పించారు. మరోవైపు, చైనాలో జరిగిన సమావేశంలో ట్రంప్‌కు రాహుల్ పానీయాలు అందిస్తున్నట్లుగా రూపొందించిన ఏఐ చిత్రాన్ని బీజేపీ సోషల్ మీడియాలో పంచుకుంది. పార్టీ జాతీయ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా ఈ చిత్రాన్ని ఎక్స్‌లో పోస్టు చేస్తూ 'కుచ్ ఐసే' అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. నవ్వుతున్న, ఫైర్ ఎమోజీలను కూడా జత చేశారు.

జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఐపీఎస్ అదేశాలమేరకు

- మోమిన్‌పేట్ ACR కాలనీలో పోలీసుల కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం.

మొమిన్ పెట్ మండలం, నవంబర్,21(సమయం న్యూస్)



వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా,ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల నివారణ లక్ష్యంగా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా శనివారం మోమిన్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ACR కాలనీలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు.జిల్లా అదనపు ఎస్పీ రాజేష్ మీనా, IPS పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వికారాబాద్ డీఎస్పీ అంజయ్య, మోమిన్‌పేట్ సీఐ వెంకట్, ఎస్సైలు, పోలీస్ అధికారులు మరియు సిబ్బంది కలిపి సుమారు 65 మంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా పోలీసులు కాలనీలో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తూ, ప్రజల భద్రతకు సంబంధించిన అంశాలను పరిశీలించారు. మొత్తం 87 వాహనాలను తనిఖీ చేయగా, వాటిలో 75 ద్విచక్ర వాహనాలు, 6 త్రిచక్ర వాహనాలు, 6 నాలుగు చక్రాల వాహనాలు ఉన్నాయి. తనిఖీల్లో అక్రమంగా కలిగి ఉన్న 14.5 లీటర్ల మద్యం, ప్రభుత్వ నిషేధిత 500 గుట్కా ప్యాకెట్లను (సుమారు రూ.1,500 విలువ) స్వాధీనం చేసుకున్నారు.ఈ సందర్భంగా అదనపు ఎస్పీ రాజేష్ మీనా, IPS మాట్లాడుతూ, ప్రజల భద్రత, నేరాల నియంత్రణ పోలీస్ శాఖ ప్రధాన ప్రాధాన్యతలని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు, అక్రమ అక్రమ రావణాలు, నిషేధిత వస్తువుల వినియోగం మరియు ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలపై నిరంతరం నిఘా కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఇలాంటి కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాల ద్వారా ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించడంతో పాటు, నేరాలకు అవకాశం కల్పించే పరిస్థితులను ముందుగానే గుర్తించి నియంత్రించవచ్చని పేర్కొన్నారు.ప్రజలు తమ పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని,వాహనదారులు తప్పనిసరిగా వాహనాలకు సంబంధించిన సరైన ధ్రువపత్రాలను కలిగి ఉండాలని సూచించారు. ప్రజలు పోలీస్ శాఖకు సహకరిస్తూ శాంతిభద్రతల పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు.

వనంపల్లి గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరం

- గొర్రెలకు అమ్మతల్లి వ్యాధి నివారణ టీకాలు, మేకలకు గోట్ పాక్స్ టీకాలు వేశారు

సంగారెడ్డి జిల్లా జరాసంగం సమయం న్యూస్

నవంబర్ 21

సంగారెడ్డి జిల్లా జరాసంగం మండల పరిధిలోని వనంపల్లి గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించడం జరిగింది ఈ శిబిరంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ హర్షవర్ధన్ రెడ్డి గారు పశువులకు గర్భకోశ సంబంధిత పరీక్షలు, సాధారణ వైద్య చికిత్సలు నిర్వహించడంతో పాటు లేగదూడలకు నట్టల నివారణ మందులు అందించారు గొర్రెలకు అమ్మతల్లి వ్యాధి నివారణ టీకాలు, మేకలకు గోట్ పాక్స్ టీకాలు వేశారుఈ సందర్భంగా డాక్టర్ హర్షవర్ధన్ రెడ్డి గారు రైతులతో మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా పశువులకు పచ్చిమేత కొరత ఏర్పడకుండా రైతులు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. తమ వ్యవసాయ భూముల్లో పచ్చిమేత సాగు చేసుకోవాలని, VBG RAM G పథకం ద్వారా ఎకరానికి రూ.14,000 వరకు ఆర్థిక సహాయం జాబ్ కార్డు ద్వారా అందించే అవకాశం ఉందని వివరించారుఅలాగే లేగదూడల ఆరోగ్య పరిరక్షణపై మాట్లాడుతూ, పుట్టిన 10వ రోజు, 21వ రోజు, అనంతరం నెలకు ఒకసారి చొప్పున ఆరు నెలల వరకు క్రమం తప్పకుండా నట్టల నివారణ మందులు తాగించాలని సూచించారు. ఈ విధంగా శాస్త్రీయ పద్ధతిలో నట్టల నివారణ చేపట్టడం ద్వారా దూడల మరణాలను గణనీయంగా,సుమారు 70 శాతం వరకు తగ్గించవచ్చని వివరించారు VBG RAM G పథకం ద్వారా పచ్చిమేత సాగుకు దరఖాస్తు చేసుకోవడానికి అవసరమైన పత్రాలు

1. ఆధార్ కార్డు జిరాక్స్.
2. ఉపాధి హామీ జాబ్ కార్డు జిరాక్స్.



3.
4. బ్యాంకు ఖాతా వివరాల జిరాక్స్

పై పత్రాలను జతపరిచి మండల ఏపీఓ గారికి సమర్పించాలని రైతులకు సూచించారు

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మల్లన్న పటేల్, ఉపసర్పంచ్ చంద్రమ్మ, పశువైద్య సిబ్బంది, గోపాలమిత్ర సూపర్‌వైజర్ సి. అర్జున్నయ్య, రాములు, ఎల్ఎస్‌సీ సులోచన రాణి, ఎల్ఎస్ఏ స్వామి, ఓఎస్ గోపాలమిత్ర అశోక్ తదితరులు పాల్గొన్నారు. గ్రామానికి చెందిన పలువురు పాడి రైతులు అధిక సంఖ్యలో హాజరై శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

- మహిళల/బాలల భద్రతే "షీ" టీమ్స్ లక్ష్యం పరిగి సబ్ డివిజన్ "షీ" టీమ్ ఇంచార్జ్ నర్సింహులు
- జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఐపీఎస్ అదేశాలమేరకు

పూడూరు మండలం, నవంబర్,21(సమయం న్యూస్)



ఆన్ లైన్ మోసాలు, సైబర్ నేరాల పై అప్రమత్తంగా వుండాలని పరిగి సబ్ డివిజన్ "షీ" టీమ్ ఇంచార్జ్ నర్సింహులు అన్నారు.వికారాబాద్ జిల్లా చెంగేముల్ పోలీస్ స్టేషన్ పరిధి లోని పూడూరు "జడ్పిహెచ్ఎస్ స్కూల్ లో శనివారం జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా ఐపీఎస్ మరియు పరిగి డిఎస్పీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు పరిగి సబ్ డివిజన్ "షీ" టీమ్ ఇంచార్జ్ నర్సిములు ఆధ్వర్యంలో విద్యార్థులకు "షీ" టీమ్ పనితీరు, ఆన్ లైన్ మోసాలు, 1930, సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా "షీ" టీమ్ ఇంచార్జీ నర్సిములు మాట్లాడుతూ, బాలికల భద్రతే "షీ" టీమ్స్ లక్ష్యమని పాఠశాలలో కాని బయట ఎక్కడైన ఆకతాయిలు బాలికలను భయాందోళనలకు గురిచేసినా, వేధించినా ఇబ్బందికరంగా మాట్లాడిన వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 112, 181 కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా మహిళ పై జరుగుతున్న నేరాలు, నిర్భయ చట్టం, పోక్సో చట్టం, 112డైయల్ "షీ" టీమ్ నం181, సీసీ కెమెరాలు, బాల్య వివాహాలు, బాలకార్మిక వ్యవస్థ, కమ్యూనిటీ పోలిసింగ్, మానవ అక్రమ రవాణ, మద్యపాన నిషేధం, బ్యాంకింగ్ ఆన్లైన్ మోసాలు, గంజాయి నిర్మూలన, డ్రగ్స్ నిషేధం అదేవిధంగా సైబర్ క్రైం నం.1930 పై అవగాహన తోపాటు వివిధ అంశాలపై విద్యార్థిని విద్యార్థులకు లకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా స్థానిక పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ పెంటయ్య,కళ బృందం టీమ్ ఇంచార్జి అశోక్,వారి బృందం జెడ్పిహెచ్ఎస్ హెడ్ మాస్టర్ రిషి,మరియు ఉపాధ్యాయులు,విద్యార్థిని,విద్యార్థుల తోపాటు "షీ" టీమ్ సభ్యులు

జిల్లా అభివృద్ధి ప్రణాళిక ను పకడ్బందీ గా రూపకల్పన చేయాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్

ఖమ్మం, నవంబర్ 21 : (సమయం న్యూస్)

ఖమ్మం జిల్లా అభివృద్ధి ప్రణాళిక రూపకల్పన పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్ అన్నారు . శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో జిల్లా అభివృద్ధి ప్రణాళిక రూపకల్పన పై కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, శిక్షణ సహాయ కలెక్టర్ పారస్ కుమార్ లతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి శాఖ తమ లక్ష్యాలను స్వల్పకాలిక, మధ్యకాలిక, దీర్ఘకాలిక ప్రణాళికలుగా విభజించుకుని, నిర్దేశిత గడువులోగా వాటి సాధనకు పక్కా కార్యాచరణతో ఉండాలన్నారు. వ్యవసాయ, అనుబంధ రంగాలతో పాటు విద్యుత్, పునరుత్పాదక ఇంధన, తాగునీటి రంగాల అభివృద్ధి లక్ష్యాలపై చర్చించారు. వ్యవసాయ రంగంలో భాగంగా 2032 మార్చి నాటికి రైతుల నికర ఆదాయాన్ని 15 శాతం మేర పెంచడం, 5 వేల ఎకరాల్లో లాభదాయక సాగు పద్ధతులను విస్తరించడం, డ్రోన్ల వినియోగం, యాంత్రీకరణ ప్రణాళిక చేయాలన్నారు. ఉద్యానవన శాఖ పరిధిలో ఆయిల్ పామ్ సాగు విస్తరణతో పాటు డ్రిప్ ఆటోమేషన్ పెంచాలని, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో 2030 నాటికి పశువుల్లో గాలికుంటు, పీపీఆర్, రేబిస్ వ్యాధుల పూర్తి నిర్మూలన, 4 వేలకు పైగా పశువుల షెడ్ల నిర్మాణం, పశుగ్రాస క్షేత్రాల అభివృద్ధి, మత్స్య శాఖ ద్వారా చెరువుల అభివృద్ధి, ఆధునిక మత్స్య మార్కెట్ల నిర్మాణం, మత్స్యకారులకు కిసాన్ క్రెడిట్ కార్డుల మంజూరు వంటి అంశాలపై దృష్టి సారించాలని సూచించారు.

జిల్లాలో నిరంతరాయ, నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం నూతన 33/11 కేవీ సబ్‌స్టేషన్ల నిర్మాణం, ఓవర్‌లోడ్ ఫీడర్ల విభజన, భూగర్భ కేబుల్ పనులు, వినియోగదారుల ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి ప్రాధాన్యతనివ్వాలని తెలిపారు. టీజీరెడ్కో ద్వారా పీఎం సూర్య ఘర్, పీఎం కుసుమ్, మోడల్ సోలార్ గ్రామాల పథకాల కింద సోలార్ రూఫ్‌టాప్‌లు, వ్యవసాయ సోలార్ పంపుసెట్లు, ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటును వేగవంతం చేయాలని సూచించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చేతిపంపులు, పైప్‌లైన్ల మరమ్మతులు, నూతన ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకుల నిర్మాణ కార్యాచరణ కు కలెక్టర్ సూచించారు. సెర్ప్ శాఖ పరిధిలో జిల్లాలో మహిళలను స్వయం సహాయక సంఘాల్లో భాగస్వాములను చేయడం, వారిలో సగం మందిని కోటీశ్వరులుగా తీర్చిదిద్దే దిశగా ప్రణాళికలు రూపొందించడం వంటి లక్ష్యాలను నిర్దేశించుకోవాలని ఉదాహరణగా తెలిపారు. సాగునీటి శాఖ ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరు అందించడం, జాతీయ, రాష్ట్ర రహదారుల అభివృద్ధి, సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడం, కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమల వల్ల కలిగే సమస్యల పరిష్కారం వంటి అంశాలపై శాఖల వారీగా లక్ష్యాలు రూపొందించాలని అన్నారు. జిల్లాలో పర్యాటక అభివృద్ధికి ఉన్న అవకాశాలను గుర్తించి పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. 2028 నాటికి తలసరి ఆదాయాన్ని రూ.5 లక్షలకు, 2033 నాటికి రూ.10 లక్షలకు పెంచే లక్ష్యంతో శాఖల వారీగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ సూచించారు. 2033 34 నాటికి ఖమ్మం జిల్లాను అభివృద్ధి చెందిన జిల్లాగా ప్రకటించే స్థాయికి తీసుకెళ్లేందుకు సమన్వయంతో పని చేయాలని అన్నారు. లక్ష్యాలను నిర్దేశించుకోవడమే కాకుండా వాటి సాధనకు అవసరమైన వనరులు, చేపట్టాల్సిన పనులు, అమలు చేయాల్సిన విధానం, నిర్దిష్ట కాలపరిమితులను స్పష్టంగా పేర్కొనాలని అన్నారు. జిల్లా అభివృద్ధిలో అన్ని రంగాల సమతుల్య వృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రతి రంగానికి సంబంధించి అవసరమైన గణాంకాలను సేకరించి విశ్లేషణ ఆధారంగా ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. అంతకుముందు కలెక్టర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై సమీక్ష చేశారు. ప్రజల దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, త్వరితగతిన పరిష్కార చర్యలు తీసుకోవాలని తెలిపారు. దరఖాస్తు తిరస్కారంపై కారణాలతో సహా దరఖాస్తుదారునికి వ్రాతపూర్వకంగా తెలిపాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు, ఎంపిడిఓ లు, తదితరులు పాల్గొన్నారు.



పాదచారుల భద్రతకు ప్రాధాన్యం

హైదరాబాద్, నవంబర్ 21

పట్టణ రవాణాలో వాహనాల వేగం కంటే పాదచారుల భద్రత, సౌకర్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని సెషన్-17లో వక్తలు సూచించారు. నడిచే హక్కు రాజ్యాంగంలోని ఆర్టికల్-21లోని జీవించే హక్కులో భాగమని సుప్రీంకోర్టు తీర్పులను ప్రస్తావించారు.గుజరాత్, తెలంగాణ, ఉత్తరప్రదేశ్‌లో పాదచారుల కోసం చేపట్టిన సేఫ్ కారిడార్లు, ఫుట్‌పాత్‌లు, మెట్రో-MMTS అనుసంధాన మార్గాలు, సంపూర్ణ వీధుల అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. హైదరాబాద్‌లో 120 ప్రాధాన్య కారిడార్లను గుర్తించినట్లు తెలిపారు. వీధుల రూపకల్పనలో భద్రత, నిరంతరత, సౌకర్యం, రక్షణ, గౌరవం అనే ఐదు సూత్రాలను పాటించాలని సూచించారు. ఫుట్‌పాత్‌లు కనీసం 2 మీటర్ల వెడల్పుతో, అడ్డంకులు లేకుండా ఉండాలని పేర్కొన్నారు. పాదచారులకు సురక్షితమైన, అందరికీ అందుబాటులో ఉండే పట్టణ రవాణా వ్యవస్థ అవసరమని సెషన్ చైర్ తెలిపారు.



రాష్ట్రస్థాయి ఎస్.జీ.ఎఫ్ వాలీబాల్ క్రీడలకు అభిలాష్ ఎంపిక

రాయపోల్ నవంబర్ 22 (సమయం న్యూస్)

సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం రాంసాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకుచెందిన విద్యార్థి అభిలాష్ ఎస్.జీ.ఎఫ్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ క్రీడోత్సవాలకు ఎంపికైయ్యారు. భద్రాదికొత్తగూడెం జిల్లా కొత్తగూడెంలో జరగనున్న రాష్ట్రస్థాయి ఎస్.జి.ఎఫ్.వాలీబాల్ క్రీడా పోటీలకు ఎంపికయ్యాడు.విద్యార్థి అభిలాష్ రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి శైలజ హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు రాజ్ కుమార్, నరేందర్ రెడ్డి, యాదయ్య, నవీన్ కుమార్, మహేష్, శ్యామ్ సుందర్ శర్మ, మంజుల, హనీఫ్, ఉమారాణి, సీఆర్‌పీ స్వామి గౌడ్ తదితరులు అభిలాష్‌ను అభినందించి, రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా అద్భుత ప్రతిభ కనబరిచి పాఠశాలకు, మండలానికి మంచి పేరు తీసుకురావాని ఆకాంక్షించారు. విద్యార్థి అభిలాష్ సాధించిన ఈ విజయం పాఠశాలకే గర్వకారణమని ఉపాధ్యాయులు గ్రామస్తులు అభినందించారు.



లాటరీ ద్వారా లబ్ధిదారుల ఎంపిక

- లాటరీ ద్వారా లబ్ధిదారుల ఎంపిక

హైదరాబాద్, నవంబర్ 21:

క్రైస్తవ మైనారిటీల ఆర్థిక సహాయ పథకం కింద చిరు వ్యాపారాలు, ఈస్ముూటర్ల కోసం లబ్ధిదారుల ఎంపికను జిల్లా స్థాయి కమిటీ బహిరంగ లాటరీ ద్వారా చేపట్టింది. చిరు వ్యాపారాల కోసం 390 దరఖాస్తులు రాగా, 150 మంది అర్హులుగా గుర్తించి వారిలో 30 మందిని ఎంపిక చేశారు. ఈస్ముూటర్ల కోసం నిర్దేశించిన 60 మంది లక్ష్యానికి గాను 44 మందిని లాటరీ ద్వారా ఎంపిక చేశారు.ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించిన అధికారులను అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) జితేందర్ రెడ్డి అభినందించారు. అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.



మెటా కార్యాలయంపై కాంగ్రెస్ నేతల దాడి?

- తెలంగాణలో శాంతిభద్రతలపై తీవ్ర విమర్శలు

హైదరాబాద్: నవంబర్21

గచ్చిబౌలిలోని మెటా కార్యాలయం వద్ద యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆందోళనకు దిగిన ఘటన తీవ్ర చర్చనీయాంశంగా మారింది.నేషనల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఉదయ్ భాను, ఇన్‌చార్జి మణిశర్మకు చెందిన ఫేస్‌బుక్ ఖాతాలను సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ ఈ ఆందోళన చేపట్టినట్లు సమాచారం.

తెలంగాణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు మెటా కార్యాలయం వద్దకు వెళ్లిన మాట్లు ఆరోపణలు ఉన్నాయి.అంతర్జాతీయ స్థాయి ఐటీ సంస్థల కార్యాలయాల వద్ద దాడులు, ఆందోళనలు జరిగితే తెలంగాణకు పెట్టుబడులు ఎలా వస్తాయని సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. ఒకవైపు గ్లోబల్ సమ్మిట్‌ల ద్వారా పెట్టుబడులను ఆహ్వానిస్తూ.. మరోవైపు రాష్ట్రంలో ఉన్న అంతర్జాతీయ సంస్థలపై అధికార పార్టీ నేతలు దాడులకు దిగడం ఎంతవరకు సమంజసమని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నాయి.“కాంగ్రెస్ అంటే ఎమ్మెల్యేల ఇళ్లపై దాడులా? అంతర్జాతీయ స్థాయి సంస్థల కార్యాలయాలపై దాడులా?” అంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమాతో ఆర్థిక భరోసా

- జిల్లా కలెక్టర్ కె. హరిత

ఆసిఫాబాద్, నవంబర్ 21:

అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సామాజిక భద్రత, ఆర్థిక భరోసా కల్పించడమే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం లక్ష్యమని జిల్లా కలెక్టర్ కె. హరిత తెలిపారు. జిల్లాలో 1.65 లక్షల రేషన్ కార్డు కుటుంబాల కోసం 411 కేంద్రాల్లో బీమా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. రేషన్ కార్డు నంబర్‌తో 18-59 ఏళ్ల వయసున్న కుటుంబ సభ్యుల్లో ఒకరికి రూ.5 లక్షల బీమా కల్పిస్తామని, ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ప్రజలు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు

ఆదిలాబాద్, నవంబర్ 21

అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే లక్ష్యమని ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి అన్నారు. బజార్‌హత్నూర్‌లో నూతన చేయూత పెన్షన్, ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ జిల్లాలో 14,579 నూతన పెన్షన్లు మంజూరు చేసినట్లు తెలిపారు. బోథ్ నియోజకవర్గంలో సుమారు 6 వేల పెన్షన్లు, బజార్‌హత్నూర్ మండలంలో 600కు పైగా పెన్షన్లు ఉన్నాయని చెప్పారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంలో తొలిరోజే జిల్లాలో 5,536 కుటుంబాల నమోదు పూర్తయిందన్నారు. కుటుంబ యజమాని మరణిస్తే నామినీకి రూ.5 లక్షల బీమా అందుతుందని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబం పథకంలో నమోదు చేసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్

- **ప్రథమ స్థానంలో నిలిచిన వివేక విద్యా భారతి హై స్కూల్**

ఆమనగల్ మున్సిపల్, నవంబర్,21(సమయం న్యూస్)

జన విజ్ఞాన వేదిక తెలంగాణ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, ఆమనగల్ లో మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ లో 4 ప్రభుత్వ పాఠశాలు, 7 ప్రైవేట్ పాఠశాలలు హాజరైనాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాధికారి పి. పాండు పాల్గొని టాలెంట్ టెస్ట్ పేపర్ ను విడుదల చేసి విద్యార్థులకు అందించడమైనది. పరీక్ష అనంతరం ప్రకటించిన ఫలితాలలో ప్రైవేట్ పాఠశాల నుండి వివేక విద్యా భారతి హై స్కూల్ మొదటి స్థానం సాధించారనీ ఈ కార్యక్రమ నిర్వాహకులు కె. శ్రీనివాసులు మరియు మండల విద్యాధికారి పాండు ప్రకటించారు. ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు, పాఠశాల కరస్పాండెంట్ గోలి శ్రీనివాసులు మరియు ప్రిన్సిపాల్ మహమూద్ పాఠశాల ఆవరణలో అభినందనలు తెలియజేశారు.

సంగారెడ్డిలో ఘనంగా తోపాజీ అనంత్ కిషన్ జన్మదిన వేడుకలు

- **ఐబీ గెస్ట్ హౌస్‌లో కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన జగ్గారెడ్డి**

సంగారెడ్డి జిల్లా సమయం న్యూస్ నవంబర్ 21

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్ జన్మదిన వేడుకలు సంగారెడ్డిలో ఘనంగా జరిగాయి. పట్టణంలోని ఐబీ గెస్ట్ హౌస్ ప్రాంగణంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకలకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి హాజరై తోపాజీ అనంత్ కిషన్‌తో కేక్ కట్ చేయించారు. అనంతరం ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు .ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై తోపాజీ అనంత్ కిషన్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఐబీ గెస్ట్ హౌస్ ప్రాంగణంలో జన్మదిన వేడుకలు సందడిగా సాగాయి ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జార్జ్, మహేష్ ముదిరాజ్, రమేష్, గంగేరి శ్రీహరి,కుమార్, కరంజీత్ సింగ్ తో పాటు తోపాజీ అనంత్ కిషన్ అభిమానులు, కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



పండుగల సాయన్న ఆశయాలు స్ఫూర్తిదాయకం

- **పండుగల సాయన్న ఆశయాలు స్ఫూర్తిదాయకం**

కల్వకోల్, నవంబర్ 21

పేదల ఆత్మగౌరవం, హక్కుల కోసం పండుగల సాయన్న చేసిన పోరాటం తర తరాలకు స్ఫూర్తిదాయకమని మంత్రులు వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు అన్నారు. అంతర్జాతీయ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం కల్వకోల్‌లో పండుగల సాయన్న విగ్రహాన్ని ఆవిష్కరించారు.మత్స్యకారులు, ముదిరాజ్‌ల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రులు తెలిపారు. మత్స్యకారుల ఆదాయం పెంచేందుకు ప్రాసెసింగ్, కోల్డ్ స్టోరేజీ, మార్కెటింగ్ సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పిల్లల విద్యకు ప్రతి కుటుంబం ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ముదిరాజ్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్, బిత్తిరి సత్తి తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణకు ఏరోస్పేస్‌లో రూ.4,000 కోట్ల పెట్టుబడి

- **సఫ్రాన్ నుంచి భారీ పెట్టుబడి ప్రతిపాదన**

హైదరాబాద్ నవంబర్21

హైదరాబాద్‌ను అంతర్జాతీయ ఏరోస్పేస్ తయారీ కేంద్రంగా అభివృద్ధి చేసే దిశగా తెలంగాణకు మరో భారీ పెట్టుబడి రానుంది. ఫ్రాన్స్‌కు చెందిన సఫ్రాన్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్స్ రాష్ట్రంలో సుమారు రూ.4,000 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ఆసక్తి వ్యక్తం చేసింది. ఫ్రాన్స్‌లోని సఫ్రాన్ తయారీ కేంద్రాన్ని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సందర్శించి సంస్థ ప్రతినిధులతో పెట్టుబడులు, తయారీ కార్యకలాపాల విస్తరణపై చర్చించారు. డిసెంబర్‌లో జరిగే ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో ఎంఓయూ కుదిరే అవకాశం ఉంది. ఈ పెట్టుబడి సాకారమైతే తెలంగాణలో ఏరోస్పేస్ తయారీ, అధునాతన సాంకేతికత, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలకు మరింత ఊతం లభించనుంది.



మత్స్యకారుల బతుకులకు భరోసా కల్పించాలి

- **ముదిరాజుల అభివృద్ధికి వెయ్యి కోట్ల నిధులు కేటాయించాలి**
- **ముదిరాజులను బీసీ-డి నుంచి బీసీ-ఏలోకి మార్చి సంక్షేమ పథకాలు అమలు చేయాలి**
- **ముదిరాజ్ మహాసభ వరంగల్ జిల్లా అధ్యక్షుడు పాన్నం మొగిలి**

వరంగల్, నవంబర్ 21 (సమయం న్యూస్)



మత్స్యకారుల సమస్యలను పరిష్కరించి, ముదిరాజ్ కుటుంబాల ఆర్థిక అభివృద్ధికి ప్రత్యేక సంక్షేమ పథకాలు అమలు చేయాలని ముదిరాజ్ మహాసభ వరంగల్ జిల్లా అధ్యక్షుడు పొన్నం మొగిలి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రపంచ మత్స్య కార్మిక దినోత్సవం సందర్భంగా శనివారం మాదన్నపేట మత్స్య సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జెండా పండుగలో ఆయన జెండా ఆవిష్కరించి మాట్లాడారు. ముదిరాజులను బీసీడి నుంచి బీసీఏలోకి మార్చాలని, ఉచిత చేప పిల్లల పంపిణీకి బదులుగా నగదు బదిలీ చేయాలని కోరారు. ఎల్‌నినో ప్రభావంతో చెరువుల్లో నీటి లభ్యత తగ్గిన నేపథ్యంలో చేపల పెంపకానికి సంబంధించి విధించిన నిబంధనలను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. మత్స్య సహకార సంఘం సభ్యులకు గతంలో మాదిరిగానే ప్రమాద బీమా కొనసాగించాలని, 50 ఏళ్లు నిండిన మత్స్యకారులకు చేయూత పింఛన్ అందించాలని కోరారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ శానబోయిన రాజ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్‌కు రూ.1,000 కోట్ల నిధులు కేటాయించి, ముదిరాజ్ కుటుంబాల ఆర్థిక అభివృద్ధికి ప్రత్యేక పథకాలు ప్రవేశపెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు జినుకల కొమ్ములు, జిల్లా యువత కార్యదర్శి నాయిని వేణుచంద్, చీఫ్ ప్రమోటర్ జినుకల నర్సయ్య, మాజీ అధ్యక్షులు దండు రవి, గీరబోయిన రాజేందర్, కుల పెద్దమనిషి దండు రామ్ నర్సు, జల్లి ఐలయ్య, కోశాధికారి మారపాక రమేష్, వార్డు మెంబర్ దండు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

బాల్యానికి భద్రత.. ప్రతి ఒక్కరి బాధ్యత

- **బాలల హక్కులపై అవగాహన.. సురక్షిత బాల్యమే లక్ష్యం**
- **గుడ్ టచ్–బ్యాడ్ టచ్, అక్రమ రవాణా, మాదకద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన**
- **రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి రాజ్ నిధి**

వరంగల్, నవంబర్ 21 (సమయం న్యూస్) :



బాలల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, పిల్లలకు సురక్షితమైన వాతావరణం కల్పించేందుకు సమాజమంతా కృషి చేయాలని రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి రాజ్ నిధి అన్నారు. బాలల హక్కులు, రక్షణ, వ్యక్తిగత భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు శనివారం వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కాన్ఫరెన్స్ హాల్‌లో తేజ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఏ.ప్రదీప్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జడ్జి రాజ్ నిధి మాట్లాడుతూ ప్రతి చిన్నారికి విద్య, ఆరోగ్యం, రక్షణ, గౌరవప్రదమైన జీవనం పొందే హక్కు ఉందన్నారు. బాలలపై జరిగే హింస, వేధింపులు, అక్రమ రవాణా వంటి నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, ఇబ్బందులకు గురిచేసినా భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారులకు తెలియజేయాలని చెప్పారు.విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు బాలల అక్రమ రవాణా, గుడ్ టచ్ -బ్యాడ్ టచ్, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై లఘు చిత్రాలను ప్రదర్శించారు. వీటి ద్వారా వ్యక్తిగత భద్రత, ప్రమాదకర పరిస్థితులను గుర్తించడం, అప్రమత్తంగా వ్యవహరించడం, అవసరమైనప్పుడు సహాయం కోరడం వంటి అంశాలను వివరించారు. అపరిచితుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. బాలల హక్కుల పరిరక్షణ, చిన్నారులపై జరిగే నేరాల నివారణ, వారికి సురక్షితమైన బాల్యాన్ని అందించడమే లక్ష్యంగా న్యాయ సేవాధికార సంస్థ విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సెల్ ఆర్.సురేష్, ప్యానెల్ న్యాయవాది జన్ను పద్మ, పాఠశాల డైరెక్టర్ డి.సతీష్, జి.నగేష్, కళ్యాణి, విద్యార్థులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన తాగునీటి ట్యాంకు..

- **ఎప్పుడు కూలుతుందోనని భయం!**
- **పెచ్చులూడుతున్న గోడలు.. నిత్యం నీటి లీకేజీలు పట్టించుకోని అధికారులు..**

రాయపోల్ నవంబర్ 22.



సిద్ధిపేట జిల్లా రాయపోల్ మండలం అనాజీపూర్ గ్రామంలో సుమారు 30 ఏళ్ల క్రితం నిర్మించిన తాగునీటి ఓవర్‌హెడ్ ట్యాంకు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా మారింది. ట్యాంకు గోడలపై పెచ్చులూడిపోతుండటంతో పాటు నిత్యం నీటి లీకేజీలు అవుతున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.ఏళ్ల తరబడి వినియోగంలో ఉండటంతో ట్యాంకు పూర్తిగా కాలం చెల్లిన స్థితికి చేరుకుందని గ్రామస్తులు చెబుతున్నారు. ట్యాంకు నుంచి నీరు వృథాగా పోవడమే కాకుండా, దాని నిర్మాణం బలహీనపడటంతో సమీప ప్రాంతాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు సమస్యను పట్టించుకోవడం లేదని గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించాల్సిన ట్యాంకే ప్రమాదకరంగా మారడం ఆందోళన కలిగిస్తోంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి పాత ట్యాంకు పరిస్థితిని పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ నిర్మల ఇస్తారి మాట్లాడుతూ.. కాలం చెల్లి శిథిలావస్థకు చేరుకున్న పాత ట్యాంకును తొలగించి, గ్రామ ప్రజలకు దీర్ఘకాలం ఉపయోగపడేలా నూతన ఓవర్‌హెడ్ తాగునీటి ట్యాంకును నిర్మించాలని కోరారు. సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే స్పందించి నిధులు మంజూరు చేసి, కొత్త ట్యాంకు నిర్మాణానికి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల దాహార్తిని తీర్చాల్సిన తాగునీటి ట్యాంకు ప్రమాదానికి నిలయంగా మారకముందే అధికారులు మేల్కొని చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

ఐఐటీ ఖరగ్‌పూర్ ప్లాటినం జూబ్లీ వేడుకల్లో ప్రధాని మోదీ

- **యువత ఆలోచనలకు హద్దులు లేవు: ప్రధాని మోదీ**

కోల్‌కతా, నవంబర్ 21:

ఐఐటీ ఖరగ్‌పూర్ 75వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ప్లాటినం జూబ్లీ వేడుకల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. దేశ అభివృద్ధి, ఆవిష్కరణల్లో ఐఐటీ ఖరగ్‌పూర్ 75 ఏళ్ల అనుభవం కీలక పాత్ర పోషించనుందని ఆయన అన్నారు.దేశాలు తమ ఆలోచనలకు ఉన్న హద్దులను అధిగమించినప్పుడే పూర్తి సామర్థ్యాన్ని చాటుకోగలవని ప్రధాని పేర్కొన్నారు. “Break the Limits, Unlock the Possibilities” అనే స్ఫూర్తితో భారత్ ముందుకు సాగుతోందన్నారు.స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో నిర్బంధ శిబిరంగా ఉన్న ప్రాంతంలో ఏర్పాటైన ఐఐటీ ఖరగ్‌పూర్ నేడు దేశ స్వయం సమృద్ధికి అవసరమైన యువ ప్రతిభను తీర్చిదిద్దుతోందని చెప్పారు. ఇంజినీరింగ్, అంతరిక్షం, అణుశక్తి, సాఫ్ట్‌వేర్, సెమీకండక్టర్ రంగాల్లో ఐఐటీ ఖరగ్‌పూర్ పూర్వ విద్యార్థులు విశేష సేవలు అందించారని తెలిపారు.సెమీకండక్టర్ మిషన్, అంతరిక్ష రంగంలో సంస్కరణలను ప్రస్తావిస్తూ గతంలో అసాధ్యంగా భావించిన అంశాలను భారత్ ఇప్పుడు సాకారం చేస్తోందన్నారు. యువతకు కొత్త అవకాశాలు కల్పించేందుకు అంతరిక్ష రంగాన్ని ప్రైవేటు సంస్థలకు తెరిచామని చెప్పారు. ఐఐటీ ఖరగ్‌పూర్ పూర్వ విద్యార్థి పవన్ మున్జాల్? కాదు—స్కైరూట్ ఏరోస్పేస్ వ్యవస్థాపకుడు పవన్ కుమార్ చందన వంటి యువ పారిశ్రామికవేత్తలు భారత అంతరిక్ష రంగానికి కొత్త దిశ చూపుతున్నారని పేర్కొన్నారు.2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడంలో నేటి యువత కీలక పాత్ర పోషించాల్సి ఉందని ప్రధాని సూచించారు. “నేషన్ ఫస్ట్” భావనతో ముందుకు సాగాలని, దేశంలోని ప్రధాన సవాళ్ల పరిష్కారానికి తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఐఐటీ ఖరగ్‌పూర్ 100వ వార్షికోత్సవాన్ని అభివృద్ధి చెందిన భారత్‌లో జరుపుకునేలా కృషి చేయాలని కోరుతూ, స్వామి వివేకానంద సందేశమైన “లేవండి.. మేల్కొనండి.. లక్ష్యం చేరేవరకు ఆగకండి” అని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు.గమనిక: మీ పత్రికలో స్థలం తక్కువగా ఉంటే దీన్ని ఇంకా 6-8 లైన్ల చిన్న వార్తగా కూడా

సంగారెడ్డి జిల్లాలో 11 ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

- **ఈ నెల 25వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ**

సంగారెడ్డి సమయం న్యూస్ నవంబర్ 21



సంగారెడ్డి జిల్లాలోని హత్నూర, పటాన్‌చెరు, సంగారెడ్డి ఐటీఐలతో పాటు జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఖాళీగా ఉన్న వివిధ పోస్టులను అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ విధానంలో భర్తీ చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి రవి కిరణ్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారుఅవుట్‌సోర్సింగ్ విధానంలో 3 ఆఫీస్ సబార్డినేట్స్, 3 స్వీపర్, 3 వాచ్‌మన్ పోస్టులు, కాంట్రాక్ట్ విధానంలో 2 మల్టీ పర్పస్ వర్కర్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు.ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల వయస్సు 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలని, ఎంపికైన వారికి నెలకు రూ.15,600/ వేతనం ఉంటుందని పేర్కొన్నారుఅర్హులైన అభ్యర్థులు ఈ నెల 25వ తేదీ (బుధవారం) సాయంత్రం 5 గంటలలోపు తమ దరఖాస్తులతో పాటు స్వీయ ధ్రువీకరణ, అవసరమైన ధ్రువపత్రాలను జతపరచి సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లోని జిల్లాక్‌లో ఉన్న జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. నిర్ణీత గడువు ముగిసిన తర్వాత అందిన దరఖాస్తులను స్వీకరించబోమని తెలిపారు. ఈ నెల 27వ తేదీన జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో దరఖాస్తుల పరిశీలన, విద్యార్హతల ధ్రువీకరణ, రాత పరీక్ష తదితర ప్రక్రియల ద్వారా అభ్యర్థుల ఎంపిక నిర్వహించనున్నట్లు తెలిపారు మరిన్ని వివరాలు, ఇతర సమాచారం కోసం సంగారెడ్డి జిల్లా ఉపాధి కల్పన కార్యాలయాన్ని సంప్రదించాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి సూచించారు

దిల్లీ వాణిజ్య మేళాలో తెలంగాణ ఉత్పత్తులకు ఆదరణ

- **దిల్లీ వాణిజ్య మేళాలో తెలంగాణ ఉత్పత్తులకు ఆదరణ**

దిల్లీ, నవంబరు 21

పోచంపల్లి ఇక్కత్, గద్వాల-నారాయణపేట చీరలు, వరంగల్ చేనేత తివాచీలు, కలంకారీ ఉత్పత్తులు, హైదరాబాద్ లక్క గాజులు, ముత్యాలు, గిరిజన ఆహార ఉత్పత్తులు దిల్లీలో జరుగుతున్న *45వ భారత అంతర్జాతీయ వాణిజ్య మేళా (ఐఐటీఎఫ్)*లో సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. భారత్ మండపంలోని తెలంగాణ పవిలియన్‌లో చేనేత, హస్తకళలు, సంప్రదాయ ఆహార ఉత్పత్తులతో పాటు ఎంఎస్ఎంఈ ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారు. ఇప్పపూల లడ్డూలు, చిరుధాన్యాల బిస్కెట్లు, సేంద్రియ అగరుబత్తులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ‘వికాస్ ఔర్ విరాసత్’ ఇతివృత్తంతో జరుగుతున్న మేళాలో 11 దేశాలు, 3,500 మందికి పైగా ప్రదర్శకులు పాల్గొంటున్నారు. తెలంగాణ కళాకారులు, చేనేత కార్మికులు, స్వయం సహాయక సంఘాలు కొనుగోలుదారులతో నేరుగా అనుసంధానమయ్యే అవకాశం లభిస్తోంది. మేళా నవంబరు 27 వరకు కొనసాగుతుంది. పవిలియన్‌లో *‘ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026’*కు సంబంధించిన నమోదు సదుపాయం కూడా కల్పించారు. డిసెంబరు 7-9 తేదీల్లో హైదరాబాద్ భారత్ ఫ్యూచర్ సిటీలో జరిగే సదస్సుకు క్యూఆర్ కోడ్ ద్వారా ఉచితంగా నమోదు చేసుకోవచ్చు.



ఆ పరీక్షలు మహిళలపై తీవ్రమైన హింసే!

జన్యు పరీక్షల నిబంధనపై ఫ్రాన్స్ క్రీడల మంత్రి ఆగ్రహం

మహిళా అథ్లెట్ల హక్కులకు విఘాతమంటూ తీవ్ర అభ్యంతరం

2028 ఒలింపిక్స్‌కు ముందే నిబంధనలు సమీక్షించాలని డిమాండ్

జన్యు పరీక్షలను వ్యతిరేకించిన 60 శాతం ఫ్రెంచ్ టెన్నిస్ క్రీడాకారిణులు

పారిస్, నవంబర్ 21 (సమయం న్యూస్): మహిళా క్రీడాకారిణులకు జన్యు పరీక్షలను తప్పనిసరి చేసే నిబంధనలపై ఫ్రాన్స్ క్రీడల మంత్రి మరినా ఫెరారీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇలాంటి పరీక్షలు మహిళలపై తీవ్రమైన హింసతో సమానమని, వారి హక్కులను కాలరాసే వివక్షపూరిత చర్యలని మండిపడ్డారు. 2028 లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌కు ముందే ఈ నిబంధనలను పునఃసమీక్షించాలని అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ)ని కోరారు. మహిళా క్రీడాకారిణుల అర్హత నిర్ధారణ పేరుతో జన్యు పరీక్షలు నిర్వహించడం మహిళా హక్కుల విషయంలో తిరోగమనమేనని వ్యాఖ్యానించారు. గత పారిస్ ఒలింపిక్స్‌లో అల్జీరియా బాక్సర్ ఇమానె ఖెలిఫ్ లింగ అర్హతపై వివాదం తలెత్తిన నేపథ్యంలో మహిళల విభాగంలో పోటీపడే అథ్లెట్ల అర్హత నిర్ధారణపై అంతర్జాతీయ స్థాయిలో చర్చ మొదలైంది. ఈ క్రమంలో మహిళా క్రీడాకారిణులకు కెరీర్‌లో కనీసం ఒక్కసారైనా జన్యు పరీక్షలు నిర్వహించే విధానాన్ని పలు అంతర్జాతీయ క్రీడా సమాఖ్యలు అమలు చేస్తున్నాయి. అయితే ఇలాంటి పరీక్షలను తప్పనిసరి చేయడంపై మహిళా అథ్లెట్ల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. "ఐఓసీ ఈ విషయంలో వెనక్కి తగ్గుతుందో లేదో చెప్పలేను. కానీ నిబంధనలను పునఃపరిశీలిస్తుందని ఆశిస్తున్నాను. ఇప్పటికే అనేక అంతర్జాతీయ సమాఖ్యలు జన్యు పరీక్షలను అమలు చేస్తున్నాయి. టెన్నిస్‌లోనూ ఈ పరీక్షలను తప్పనిసరి చేస్తున్నారు. ఫ్రాన్స్‌కు చెందిన మహిళా టెన్నిస్ క్రీడాకారిణుల్లో 60 శాతం మంది వీటిని వ్యతిరేకించారు. ఇది మహిళల పట్ల స్పష్టమైన వివక్ష. వారి హక్కుల విషయంలో వెనుకడుగు వేయడమే" అని ఫెరారీ పేర్కొన్నారు. 2030 శీతాకాల ఒలింపిక్స్‌కు ఫ్రాన్స్ ఆతిథ్యం ఇవ్వనున్న నేపథ్యంలో అప్పటికి పరిస్థితులు ఎలా ఉంటాయనే ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే యూరోపియన్ యూనియన్ సమావేశంలో ఈ అంశాన్ని ప్రస్తావించానని, మహిళా అథ్లెట్ల అభ్యంతరాలను సంబంధిత వర్గాల దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. జన్యు పరీక్షల విషయంలో స్పష్టమైన విధానం లేకపోతే యువ క్రీడాకారిణులు క్రీడల్లోకి రావడంపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదముందని హెచ్చరించారు. మహిళల గౌరవం, హక్కులను కాపాడేలా అంతర్జాతీయ క్రీడా సంస్థలు నిర్ణయాలు తీసుకోవాలని ఫెరారీ కోరారు.



ఉద్యోగులకు కావ్య మారన్ సర్‌ప్రైజ్ గిఫ్ట్..

బంగారు ఉంగరాలు, చాక్లెట్లతో పెళ్లి కానుక!

చెన్నై, నవంబర్ 21 (సమయం న్యూస్): సన్‌రైజర్స్ హైదరాబాద్ సీఈఓ, సన్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కావ్య మారన్ పేరు సామాజిక మాధ్యమాల్లో మరోసారి చర్చనీయాంశమైంది. ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్‌తో ఆమె వివాహం జరిగినట్లు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో సన్ గ్రూప్ ఉద్యోగులకు ప్రత్యేక కానుకలు పంపించినట్లు వీడియోలు వైరల్ అవుతున్నాయి. కానుకల పెట్టెల్లో పెళ్లి ఆహ్వాన పత్రికలు, చాక్లెట్లతోపాటు బంగారు ఉంగరాలు ఉన్నట్లు నెటిజన్లు పేర్కొంటున్నారు. అయితే ఈ కానుకలు కావ్య మారన్ వివాహానికి సంబంధించినవేనని స్వతంత్రంగా ధ్రువీకరించే సమాచారం అందుబాటులో లేదు. సామాజిక మాధ్యమాల్లో ప్రచారంలో ఉన్న వీడియోల్లో ఉద్యోగులు కానుకల పెట్టెలను తెరిచి చూస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నట్లు చెబుతున్నారు. బంగారు నాణేలు ఉంటాయని భావించగా ఉంగరాలు కనిపించడంతో ఆశ్చర్యపోయినట్లు ఓ ఉద్యోగి వ్యాఖ్యానించిన వీడియో కూడా వైరల్ అవుతోంది. ఆహ్వాన పత్రికలో నవంబర్ 25న ప్రత్యేక విందు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారని ప్రచారం జరుగుతోంది. అయితే ఆ కార్యక్రమం సన్ గ్రూప్ ఉద్యోగుల కోసమే నిర్వహిస్తున్నారా అనే విషయంపై స్పష్టత లేదు. మరోవైపు కావ్య మారన్, అనిరుధ్ రవిచందర్ నవంబర్ 11న గ్రీస్‌లో ఆత్మగౌరవ వివాహ పద్ధతిలో ఒక్కటయ్యారని, నవంబర్ 21న చెన్నైలో వివాహ విందు నిర్వహించనున్నారని సామాజిక మాధ్యమాల్లో కథనాలు వెలువడుతున్నాయి. అయితే ఈ వివాహం, కానుకలు, విందు కార్యక్రమాలకు సంబంధించి అధికారిక ప్రకటన వెలువడిందో లేదో నిర్ధారణ కావాల్సి ఉంది. దీంతో వైరల్ వీడియోల వెనుక వాస్తవాలపై ఆసక్తి నెలకొంది.

94 ఏళ్ల భారత టెస్ట్ చరిత్రలో తొలిసారి

విదేశీ గడ్డపై టీమిండియా అరుదైన రికార్డు!

న్యూజిలాండ్‌తో వెల్లింగ్‌టన్‌లోని బేసిన్ రిజర్వ్ మైదానంలో జరుగుతున్న తొలి టెస్ట్‌లో టీమిండియా బ్యాటర్లు అద్భుత ప్రదర్శనతో చరిత్ర సృష్టించారు. ఒకే ఇన్నింగ్స్‌లో భారత టాప్-5 బ్యాటర్లు అందరూ 50 లేదా అంతకంటే ఎక్కువ పరుగులు సాధించి, విదేశీ గడ్డపై ఈ ఘనత సాధించిన తొలి భారత జట్టుగా నిలిచారు.



వెల్లింగ్‌టన్, నవంబర్ 21 (సమయం న్యూస్): న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి టెస్ట్‌లో టీమిండియా బ్యాటర్లు అద్భుత ప్రదర్శన చేశారు. వెల్లింగ్‌టన్‌లోని బేసిన్ రిజర్వ్ మైదానంలో భారత టాప్-5 బ్యాటర్లు అందరూ 50 లేదా అంతకంటే ఎక్కువ పరుగులు సాధించి అరుదైన ఘనతను అందుకున్నారు. భారత టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఒకే ఇన్నింగ్స్‌లో టాప్-5 బ్యాటర్లు అర్ధశతకాలు చేయడం ఇది ఐదోసారి కాగా, విదేశీ గడ్డపై ఈ ఘనత సాధించడం మాత్రం ఇదే తొలిసారి. న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 368 పరుగులకు ఆలౌట్ కాగా, భారత్ మూడో రోజు ఆట ముగిసే సమయానికి 4 వికెట్ల నష్టానికి 486 పరుగులు చేసి 118 పరుగుల ఆధిక్యాన్ని సంపాదించింది. ఇంకా ఆరు వికెట్లు చేతిలో ఉండటంతో నాలుగో రోజు మరింత భారీ స్కోరు సాధించాలని భారత్ భావిస్తోంది.

టాప్-5 బ్యాటర్ల అద్భుత ప్రదర్శన..

భారత ఇన్నింగ్స్‌లో ఓపెనర్ యశస్వి జైస్వాల్ 85 పరుగులతో మంచి ఆరంభాన్ని అందించగా, మరో ఓపెనర్ కేఎల్ రాహుల్ 136 పరుగులతో అద్భుత శతకం సాధించాడు. వీరిద్దరూ తొలి వికెట్‌కు 130 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ఆ తర్వాత వచ్చిన దేవదత్ పడిక్కల్ 80 పరుగులతో రాణించి, రాహుల్‌తో కలిసి రెండో వికెట్‌కు 165 పరుగులు జోడించాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 146 బంతుల్లో 98 పరుగులు చేసి సెంచరీకి కేవలం రెండు పరుగుల దూరంలో వెనుదిరిగాడు. చివర్లో రిషభ్ పంత్ దూకుడుగా ఆడి 62 బంతుల్లో 55 పరుగులతో అజేయంగా నిలవడంతో భారత టాప్-5 బ్యాటర్లందరూ అర్ధశతకాలు పూర్తి చేశారు. గతంలో స్వదేశంలో జరిగిన 1998 కోల్‌కతా (ఆస్ట్రేలియాపై), 1999 మొహాలీ (న్యూజిలాండ్‌పై), 2009 బ్రాబోర్న్ (శ్రీలంకపై), 2024 ధర్మశాల (ఇంగ్లండ్‌పై) టెస్టుల్లో మాత్రమే ఈ ఘనత నమోదు కాగా, విదేశీ గడ్డపై ఇప్పుడు తొలిసారి సాధ్యమైంది.

కేఎల్ రాహుల్ ఖాతాలో అరుదైన రికార్డులు

ఈ మ్యాచ్‌లో కేఎల్ రాహుల్ 290 బంతుల్లో 136 పరుగులు చేసి తన టెస్ట్ కెరీర్‌లో 13వ సెంచరీని నమోదు చేశాడు. తద్వారా న్యూజిలాండ్ గడ్డపై తొలి టెస్ట్ ఇన్నింగ్స్‌లోనే శతకం సాధించిన మూడో భారత ఆటగాడిగా నిలిచాడు (1976లో సునీల్ గవాస్కర్ 116, సురీందర్ అమర్‌నాథ్ 124 పరుగులతో ఈ ఘనత సాధించారు). అంతేకాకుండా దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా దేశాలన్నింటిలోనూ టెస్ట్ సెంచరీలు చేసిన ఐదో భారత క్రికెటర్‌గా (గతంలో మహమ్మద్ అజారుద్దీన్, సచిన్ టెండూల్కర్, రాహుల్ ద్రవిడ్, విరాట్ కోహ్లీ), అన్ని సేన దేశాల్లో సెంచరీలు చేసిన తొలి భారత ఓపెనర్‌గా కూడా రాహుల్ రికార్డు సృష్టించాడు. మూడో రోజు ఆట ముగిసే సమయానికి రిషభ్ పంత్ (55), అన్షుల్ కాంబోజ్ (0) క్రీజులో ఉన్నారు. నాలుగో రోజు ఆటలో భారత్ ఆధిక్యాన్ని మరింత పెంచుకుని కివీస్‌పై ఒత్తిడి పెంచాలని చూస్తోంది.



టీమ్‌ఇండియాకు అన్యాయం..

అందుకే పాకిస్థాన్‌కు ట్రోఫీ దక్కిందా?

వర్షం కారణంగా ఒక్క బంతి కూడా పడకుండానే అంధుల ఆసియా కప్ ఫైనల్ రద్దు కాగా, రన్‌రేట్ ఆధారంగా పాకిస్థాన్‌ను విజేతగా ప్రకటించడంపై భారత జట్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. టోర్నమెంట్ నిబంధనల్లో లేని రూల్‌ను తెరపైకి తెచ్చి, కీలక పదవుల్లో ఉన్న పాకిస్థాన్ సభ్యులు తమ అధికారాలను దుర్వినియోగం చేశారని టీమ్‌ఇండియా కెప్టెన్ దుర్గారావు, జట్టు మేనేజర్ ధీరజ్ సెక్వేరా ఆరోపించారు.



ఢిల్లీ, నవంబర్ 21 (సమయం న్యూస్): వర్షం కారణంగా ఒక్క బంతీ పడకుండానే అంధుల ఆసియా కప్ ఫైనల్ రద్దు కాగా, రన్‌రేట్ ఆధారంగా పాకిస్థాన్‌ను విజేతగా ప్రకటించడంపై టీమ్‌ఇండియా కెప్టెన్ దుర్గారావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. ఇది తమకు జరిగిన అన్యాయమని, విజేతను నిర్ణయించడానికి నెట్ రన్‌రేట్‌ను ఎలా పరిగణనలోకి తీసుకుంటారని ప్రశ్నిస్తే నిర్వాహకుల నుంచి స్పష్టమైన సమాధానం రాలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఉదయం 10 గంటల నుంచే తాము మైదానంలో ఉన్నామని, వర్షం ఎడతెరిపి లేకుండా కురుస్తుండగా సాయంత్రం 4.15 గంటలకు కట్‌ఆఫ్ టైమ్ ఉంటుందని అంపైర్లు చెప్పినట్లు తెలిపాడు. కానీ, సాయంత్రం 4 గంటలకే రన్ రేట్ ఆధారంగా పాకిస్థాన్‌ను విజేతగా ప్రకటిస్తున్నామని చెప్పడం భారత క్రీడాకారులను, అధికారులను దిగ్భ్రాంతికి గురిచేసిందని దుర్గారావు వివరించాడు. అసలు మ్యాచ్ మొదలుకాకముందే రన్ రేట్ ఆధారంగా విజేతను ప్రకటించే విధానం అంధుల క్రికెట్ నిబంధనల్లో ఎక్కడా లేదని, ఆసియా కప్ వంటి పెద్ద టోర్నీలో నిబంధనలను పరిశీలించకుండా నిర్ణయం తీసుకోవడంపై మ్యాచ్ రిఫరీని ప్రశ్నించినా సరైన సమాధానం రాలేదని పేర్కొన్నాడు.

పాక్ సభ్యుల అధికార దుర్వినియోగమే కారణమా?:

ఈ వివాదంపై భారత జట్టు మేనేజర్ ధీరజ్ సెక్వేరా స్పందిస్తూ.. ఇది వరల్డ్ బ్లైండ్ క్రికెట్ కౌన్సిల్ టెక్నికల్ టీమ్ వైఫల్యమేనని స్పష్టం చేశారు. టెక్నికల్ డైరెక్టర్ తాహీర్ భట్ పాకిస్థాన్ టీమ్‌కు ఫిజియోగా వ్యవహరిస్తున్నారని, అలాగే కౌన్సిల్ ప్రెసిడెంట్ సయ్యద్ సుల్తాన్ షా కూడా పాకిస్థాన్ బ్లైండ్ క్రికెట్ జట్టు ఛైర్మన్‌గా ఉన్నారని ఆయన గుర్తు చేశారు. కీలక పదవుల్లో ఉన్న పాక్ సభ్యులు తమ అధికారాలను దుర్వినియోగం చేసి ఏకపక్ష నిర్ణయం తీసుకున్నారని ఆరోపించారు. వరల్డ్ బ్లైండ్ క్రికెట్ కౌన్సిల్ సెక్రటరీ జనరల్‌గా ఉన్న రజనీశ్ హెన్రీ స్వయంగా అక్కడే ఉండి ఈ నిబంధన పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారని, ఆస్ట్రేలియాలో ఉన్న గ్లోబల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ రేమండ్ మాక్స్‌లీను సంప్రదించగా ఆయన కూడా ఇది క్రీడా స్ఫూర్తికి విరుద్ధమని అభిప్రాయపడినట్లు ధీరజ్ సెక్వేరా వెల్లడించారు.

సిరాజ్ అంశంపై మనం మాట్లాడొద్దు

సెలక్టర్ల నిర్ణయాన్ని గౌరవించాలి: కపిల్ దేవ్

న్యూఢిల్లీ, నవంబర్ 21 (సమయం న్యూస్): భారత క్రికెటర్ మహ్మద్ సిరాజ్‌కు కివీస్‌తో తొలి టెస్టు తుది జట్టులో చోటు కల్పించకపోవడం చర్చనీయాంశంగా మారింది. దీనిపై పలువురు మాజీలు విశ్లేషణలు, అసంతృప్తి వ్యక్తం చేయగా, ఓ కాంగ్రెస్ ఎంపీ చేసిన మతపరమైన వ్యాఖ్యలు దుమారం రేపాయి. దానికి భాజపా కూడా ఘాటుగా కౌంటర్ ఇచ్చింది. తాజాగా ఓ కార్యక్రమంలో కపిల్ దేవ్ ఎదుట ఈ అంశం ప్రస్తావనకు రాగా.. ఇలాంటి వాటిపై ఎవరూ మాట్లాడొద్దని ఆయన స్పష్టం చేశారు. సిరాజ్‌ను ఎందుకు పక్కన పెట్టారనేది సెలక్టర్లను అడగాలని, అది చెప్పడానికి తాను ఎవరినని ప్రశ్నించారు. ప్రజలు కూడా ఇలాంటి విషయాలపై కామెంట్లు చేయకూడదని, జట్టు ఎంపిక కోసం ఓ వ్యవస్థ ఉందని, బాధ్యతలు నిర్వర్తించే వ్యక్తులే స్పష్టమైన సమాధానం ఇస్తారని కపిల్ తెలిపారు. ప్రతి ఒక్కరినీ సంతోషపరచడం సాధ్యం కాదని, వ్యవస్థను విమర్శించడం సరికాదని పేర్కొన్నారు. భారత క్రికెట్ బాగా సాగుతోందని, తనకు కూడా సిరాజ్ అంటే ఇష్టమే అయినప్పటికీ సెలక్టర్లు, మేనేజ్‌మెంట్, కెప్టెన్ జట్టు కూర్పు కోసం అవసరమైన మార్పులు చేసుకుంటారని, అందులో వ్యక్తిగత ఇష్టాయిష్టాలు విషయమే కాదని వివరించారు.



సచిన్‌కూ తప్పలేదు..

ప్రస్తుత ఫామ్‌కే ప్రాధాన్యత: కైఫ్

జట్టులో మార్పులు చేయడం అత్యంత సహజమని మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ పేర్కొన్నారు. ఒకటీ లేదా రెండు మ్యాచుల్లో విఫలమైతే జట్టు నుంచి పక్కన పెడతారని, సచిన్ తెందుల్కర్‌కూ ఇలాంటి పరిస్థితులు తప్పలేదని గుర్తు చేశారు. కుల్‌దీప్, అశ్విన్, రోహిత్, విరాట్, సూర్య, షమీ వంటి ఎంతోమంది జాబితాలో ఉన్నారని తెలిపారు. ఇక్కడ సీనియర్లా కాదా అనేది కాకుండా, సీనియర్ అయినంత మాత్రాన ఇప్పుడు ఏం చేస్తున్నామనేదే ముఖ్యమని స్పష్టం చేశారు. గత సిరీస్‌లో ఆటగాళ్లు ఎలా ఆడారనేదానిపైనే మేనేజ్‌మెంట్ దృష్టి పెడుతుందని, శ్రీలంకతో టెస్టు సిరీస్‌లో సిరాజ్ గొప్ప ప్రదర్శన చేయలేకపోయాడని మహ్మద్ కైఫ్ అభిప్రాయపడ్డారు.





నా జీవితంలోని ఆనందం నువ్వే

అర్హకు బన్నీ ఎమోషనల్ విషెస్!,, గారాలపట్టి పుట్టినరోజున అల్లు అర్జున్ ప్రత్యేక పోస్ట్

హైదరాబాద్, నవంబర్ 21 (సమయం న్యూస్): ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తన గారాలపట్టి అల్లు అర్హ పుట్టినరోజు సందర్భంగా భావోద్వేగభరితమైన సందేశాన్ని పంచుకున్నారు. కుమార్తెతో సరదాగా గడిపిన ఓ అందమైన క్షణాన్ని అభిమానులతో పంచుకుంటూ ప్రత్యేకంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో అర్హతో కలిసి దిగిన ఫొటోను పోస్ట్ చేసిన బన్నీ.. “నా జీవితంలోని ఆనందానికి పుట్టినరోజు శుభాకాంక్షలు” అంటూ ప్రేమను వ్యక్తం చేశారు. చిన్న సందేశంతోనే కుమార్తెపై తనకున్న అపారమైన ప్రేమను చాటుకున్నారు. అల్లు అర్జున్ పోస్ట్ చేసిన ఫొటో సామాజిక మాధ్యమాల్లో అభిమానులను ఆకట్టుకుంటోంది. కొద్దిసేపట్లోనే మూడు లక్షలకు పైగా లైకులు వచ్చినట్లు సమాచారం. పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు అల్లు అర్హకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. సినిమాలతో ఎంత బిజీగా ఉన్నప్పటికీ పిల్లలతో గడిపే మధుర క్షణాలను అభిమానులతో పంచుకోవడం బన్నీకి అలవాటు. తాజాగా కుమార్తె పుట్టినరోజున చేసిన పోస్ట్ మరోసారి అభిమానుల మనసులు గెలుచుకుంది.

‘ఒసేయ్ రాములమ్మ’ అనగానే భయమేసింది!

పాట ఆవిష్కరణ కార్యక్రమంలో రష్మిక మందన్న ఆసక్తికర వ్యాఖ్యలు




హైదరాబాద్, నవంబర్ 21 (సమయం న్యూస్): తెలుగు సినీ చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న ‘ఒసేయ్ రాములమ్మ’ చిత్రంలోని టైటిల్ గీతాన్ని మళ్లీ తెరకెక్కిస్తున్నామని తెలియగానే తనకు భయమేసిందని ప్రముఖ కథానాయిక రష్మిక మందన్న వెల్లడించారు. అలాంటి గొప్ప పాట స్థాయిని పూర్తిగా అందుకోలేకపోయినా, దానికి న్యాయం చేసేందుకు తమ వంతు ప్రయత్నం చేశామని చెప్పారు. రష్మిక ప్రధాన పాత్రలో రవీంద్ర పుల్లె దర్శకత్వంలో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం ‘మైసా’. అన్‌ఫార్ములా ఫిల్మ్స్ నిర్మిస్తున్న ఈ సినిమాలో సముద్రఖని, రావు రమేశ్, ఈశ్వరీ రావు తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. నవంబర్ 27న విడుదల కానున్న ఈ చిత్రంలో ‘ఒసేయ్ రాములమ్మ’ టైటిల్ గీతాన్ని కొత్త రూపంలో రూపొందించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో చిత్ర బృందం ఈ పాటను విడుదల చేసింది. ఈ సందర్భంగా రష్మిక మాట్లాడుతూ 1997లో విడుదలైన ‘ఒసేయ్ రాములమ్మ’ అప్పట్లోనే సంచలనం సృష్టించిందని గుర్తుచేశారు. ఎంతో ముందు చూపుతో రూపొందించిన ఆ చిత్రం ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసిందన్నారు. “అలాంటి గొప్ప చిత్రంలోని పాటను మళ్లీ తెరకెక్కించడం సాధారణ విషయం కాదు. ఆ విషయం తెలియగానే భయమేసింది. అసలు పాటను పూర్తిగా మ్యాచ్ చేయలేమని మాకు తెలుసు. అయినప్పటికీ దాని గొప్పతనాన్ని నిలబెట్టేలా మా వంతు కృషి చేశాం. ఈ పాటకు వందేమాతరం శ్రీనివాస్ గాత్రం అందించడం మరింత ఆనందాన్ని ఇచ్చింది” అని పేర్కొన్నారు. అప్పట్లో ‘ఒసేయ్ రాములమ్మ’ పాటకు ప్రేక్షకులు అందించిన ఆదరణను తమ కొత్త గీతానికి కూడా అందిస్తారని ఆశిస్తున్నట్లు రష్మిక తెలిపారు. ప్రేక్షకులు ఈ ప్రయత్నాన్ని ప్రేమతో స్వీకరించాలని కోరారు. ఒకప్పటి సంచలన గీతాన్ని కొత్త తరానికి పరిచయం చేసే ప్రయత్నంగా రూపొందించిన ఈ పాట ‘మైసా’ చిత్రంపై ఆసక్తిని పెంచుతోంది.

భూమి పెడ్నేకర్ అందాల విస్ఫోటనం..

పాత వింటేజ్ సిల్క్ చీరలతో సరికొత్త ఫ్యాషన్ ప్రయోగం!

ముంబై/హైదరాబాద్, నవంబర్ 21 (సమయం న్యూస్): విలక్షణ పాత్రలతో ప్రేక్షకులను మెప్పించే బాలీవుడ్ భామ భూమి పెడ్నేకర్, సోషల్ మీడియా వేదికగా తన గ్లామర్ ఫొటోషూట్లతో అభిమానులను కట్టిపడేస్తున్నారు. తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె పంచుకున్న సరికొత్త ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. ముంబైలో నిర్వహించిన ప్రతిష్ఠాత్మక ‘ఎర్త్‌షాట్ ప్రైజ్ 2026’ వేడుక కోసం భూమి ఈ ప్రత్యేక వస్త్రధారణలో మెరిశారు. పర్యావరణ అనుకూల ఫ్యాషన్‌ను ప్రోత్సహించే ఉద్దేశంతో రూపొందించిన ఈ దుస్తులపై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. వింటేజ్ చీరలతో కొత్త ప్రయోగం.. ఆకట్టుకుంటున్న లుక్:ఈ బోల్డ్, స్టైలిష్ డ్రెస్ వెనుక ఉన్న ఆసక్తికర విషయాన్ని భూమి పెడ్నేకర్ స్వయంగా తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో వెల్లడించారు. పాతకాలపు ఎంబ్రాయిడరీ వర్క్ ఉన్న వస్త్రాలు, వింటేజ్ సిల్క్ చీరలను రీసైకిల్ చేసి ఈ కొత్త డ్రెస్‌ను తయారు చేసినట్లు ఆమె తెలిపారు. బ్రౌన్ కలర్ ఎంబ్రాయిడరీ టాప్‌కు జతగా డ్రేప్డ్ బ్లూ శాటిన్ స్కర్ట్ ధరించి, వదులైన కురులు, సంప్రదాయ ఆభరణాలతో భూమి ఇచ్చిన పోజులు ఆకట్టుకుంటున్నాయి. ప్రముఖ డిజైనర్ లేబుల్ ‘బోడ్‌మెంట్స్’ రూపొందించిన ఈ అవుట్‌ఫిట్‌కు, ‘ఆమ్రపాలి జ్యువెల్స్’ ఆభరణాలను జతచేశారు. భారతీయ హస్తకళా వారసత్వాన్ని, సస్టెయినబుల్ ఫ్యాషన్‌ను చాటిచెప్పేలా ఉన్న భూమి పెడ్నేకర్ లేటెస్ట్ ఫొటోషూట్ ఇప్పుడు ఇంటర్నెట్‌లో ట్రెండింగ్‌గా నిలిచింది.





‘హైందవ’ విడుదలకు బ్రేక్.. కొత్త తేదీ కోసం నిరీక్షణ!

నవంబర్ 27న రావాల్సిన చిత్రం వాయిదా

హైదరాబాద్, నవంబర్ 21 (సమయం న్యూస్): యువ కథానాయకుడు బెల్లంకొండ సాయి శ్రీనివాస్, సంయుక్త జంటగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం ‘హైందవ’ విడుదల వాయిదా పడింది. లుధీర్ బైరెడ్డి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని నవంబర్ 27న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని తొలుత నిర్ణయించారు. అయితే అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో ప్రేక్షకులకు మెరుగైన సినీ అనుభూతిని అందించాలనే ఉద్దేశంతో విడుదలను వాయిదా వేస్తున్నట్లు నిర్మాణ సంస్థ మూన్‌షైన్ పిక్చర్స్ శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. కొత్త విడుదల తేదీని త్వరలోనే వెల్లడిస్తామని పేర్కొంటూ అభిమానుల సహనానికి, మద్దతుకు కృతజ్ఞతలు తెలిపింది. రంగాపురం అనే గ్రామం నేపథ్యంలో సాగే ఉత్కంఠభరిత కథాంశంతో ఈ చిత్రం రూపొందుతోంది. గ్రామంలోని పురాతన ఆలయంలో విగ్రహాలన్నీ అకస్మాత్తుగా మాయమవడం, అదే సమయంలో ఓ గ్రామస్థుడు హత్యకు గురికావడంతో కథ ఆసక్తికర మలుపు తిరుగుతుంది. నిర్ణీత సమయంలోగా విగ్రహాలు తిరిగి వస్తాయని ఆలయ పూజారి విశ్వసిస్తుండగా, ఈ రహస్యాన్ని ఛేదించేందుకు దేవుడి కంటే మానవత్వాన్ని నమ్మే నాస్తిక పోలీసు అధికారి రంగంలోకి దిగుతాడు. విశ్వాసం, హేతువాదం మధ్య సంఘర్షణ నేపథ్యంలో కథ సాగనుంది. ఇటీవల విడుదలైన ప్రచార చిత్రానికి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. మహేష్ చందు నిర్మిస్తున్న ఈ చిత్రంలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ పోలీసు అధికారిగా కనిపించనున్నారు. ఆలయ పూజారిగా మహేష్ మంజ్రేకర్ కీలక పాత్ర పోషిస్తున్నారు. సౌరభ్ సచ్‌దేవా, జేడీ చక్రవర్తి, శివాజీ రాజా, గెటప్ శ్రీను తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. సామ్ సీఎస్ సంగీతం అందిస్తుండగా, హరీష్ కన్నన్ ఛాయాగ్రహణం, కార్తీక శ్రీనివాస్ కూర్పు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. విభిన్న కథాంశంతో రూపొందుతున్న ‘హైందవ’ కొత్త విడుదల తేదీపై చిత్ర బృందం ప్రకటన కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు.



‘ఇడుపు కాయితం’ పెళ్లి పాట విడుదల

హైదరాబాద్, నవంబర్ 21 (సమయం న్యూస్): ప్రియదర్శి, నాగదుర్గ ప్రధాన పాత్రల్లో నటించిన తాజా చిత్రం ‘ఇడుపు కాయితం’. దొండపాటి వంశీరెడ్డి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా డిసెంబర్ 11న ప్రేక్షకుల ముందుకు రానుంది. సినిమా ప్రచారంలో భాగంగా తాజాగా ఈ చిత్రంలోని పెళ్లి పాటను విడుదల చేశారు. ‘గోగులు గోగులు.. గోపాల కృష్ణుడు..’ అంటూ సాగే ఈ పెళ్లి పాటకు కొంగరి కృష్ణ సాహిత్యం (లిరిక్స్) అందించారు. విడుదలైన పాటతో ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసిన చిత్రబృందం, డిసెంబర్ 11న థియేటర్లలో సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తోంది.



PRINTED AND PUBLIAHED BY **MOHAMMED MURTHUZA,** 1-2-524/3/B, ROOM NO. 110, 1ST FLOOR, SAGAR VIEW COMPLEX, DOMALGUDA, HYDERABAD, TELANGANA - 500080, ON BEHALF OF MOHAMMED MURTHUZA, EDITED BY MOHAMMED MURTHUZA, PRINTED BY JAKKULA NARENDER, AT VISION ANDHRA, 2-1-340/A/4, NEAR FEVER HOSPITAL, O.U.ROAD, NALLAKUNTA, HYDERABAD, TELANGANA - 500044. **PRGI NUMBER APTEL/2006/18267.** PHONE:**7036644111, 9490140565**

పేదరికం పేరుతో బాల్యాన్ని బలి చేయొద్దు

- **చిన్నారుల చిరునవ్వులు చెదరకుండా.. హక్కులకు రక్షణ కల్పించాలి... డా.అనితా రెడ్డి**
- **బాల్యవివాహాలు.. బాల కార్మికత్వం చిన్నారుల భవిష్యత్తుకు శాపం**

వరంగల్, నవంబర్ 21 (సమయం న్యూస్) :

చిన్నారుల చేతుల్లో పుస్తకాలు ఉండాలి కానీ పని ముట్లు ఉండకూడదని, వారి బాల్యం చదువులు, ఆనందం, ఆశయాలతో సాగాలే తప్ప బాల్యవివాహాలు, బాల కార్మికత్వంతో చిదిమేయకూడదని కాకతీయ విశ్వవిద్యాలయ పాలకమండలి సభ్యురాలు, అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్ డాక్టర్ అనితా రెడ్డి అన్నారు. బాల్యవివాహాలు చేయడం, ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. అనురాగ్ హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో వరంగల్ శివనగర్‌లోని డాన్ బాస్కో నవజీవన్ వీధి బాలల వసతి గృహంలో శనివారం చిన్నారులకు రగ్గులు, పాదరక్షలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ ఆడపిల్లలు, మగపిల్లలను తల్లిదండ్రులు సమానంగా చూడాలని, ఇద్దరికీ సమాన విద్యా అవకాశాలు కల్పించాలని సూచించారు. బాలల హక్కులు, లింగ సమానత్వంపై ప్రతి కుటుంబం అవగాహన కలిగి ఉండాలని, చిన్న వయసులోనే పెళ్లిళ్లు చేసి పిల్లల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టవద్దని హితవు పలికారు. చదువుకు దూరం చేసి బాల కార్మికులుగా మార్చడం వారి హక్కులను హరించడమేనని పేర్కొన్నారు. ప్రతి బాలుడు, బాలిక బడికి వెళ్లాలి తప్ప పని ప్రదేశాల్లో ఉండకూడదని, బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించేందుకు సమాజంలోని ప్రతి



ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు మాదకద్రవ్యాలు, చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. తల్లిదండ్రులను గౌరవిస్తూ, జీవితంలో ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, క్రమశిక్షణతో నిరంతరం శ్రమించి చదివినప్పుడే అనుకున్న గమ్యాన్ని చేరుకోగలరని చిన్నారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో డాన్ బాస్కో నవజీవన్ చైర్మన్ ఫాదర్ కోషి, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ జి. దివ్య, ఫీల్డ్ కోఆర్డినేటర్ రాజు, శారద, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆపదలో అండగా సీఎం సహాయ నిధి..

- **120 మంది లబ్ధిదారులకు రూ.65.25 లక్షల చెక్కుల పంపిణీ**
- **దళారులను ఆశ్రయించొద్దు, రూపాయి ఖర్చు లేకుండా ప్రభుత్వ పథకాలు... ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**

హనుమకొండ, నవంబర్ 21 (సమయం న్యూస్)

ఆపదలో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి అండగా నిలుస్తోందని, ప్రభుత్వ సాయం పొందేందుకు ప్రజలు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రూపాయి ఖర్చు లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.శనివారం బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన 120 మంది లబ్ధిదారులకు రూ.65.25 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనారోగ్యంతో వైద్య చికిత్స



పొందుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు సీఎం సహాయ నిధి ఎంతో ఊరట నిస్తోందన్నారు. సహాయం పొందేందుకు మధ్యవర్తులకు వందలు, వేల రూపాయలు చెల్లించాల్సిన అవసరం లేదని, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లేదా తమ డివిజన్లలోని కాంగ్రెస్ నాయకుల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను పరిశీలించి, హైదరాబాద్‌లో సంబంధిత అధికారులతో మాట్లాడి నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తున్నామని తెలిపారు.ప్రతి నెలా రెండుసార్లు సీఎం సహాయ నిధి చెక్కులను తీసుకొచ్చి పంపిణీ చేస్తున్నామని, లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ తిరగకుండా వారి ఇళ్ల వద్దకే చెక్కులు చేరేలా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. డివిజన్ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, అధ్యక్షుల ద్వారా చెక్కులను అందజేస్తూ ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేస్తున్నామన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం పేదలు, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో సుమారు 2,700 మందికి చేయూత ఆసరా పింఛన్లు మంజూరు చేయగా, ప్రతి డివిజన్‌కు సగటున 110 మంది కొప్పున కొత్త లబ్ధిదారులకు పింఛన్లు అందించామని వివరించారు. అదేవిధంగా సుమారు 5,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి పేదల సొంతింటి కల సాకారం చేసేందుకు కృషి చేస్తున్నామని, సన్నబియ్యం పంపిణీతో పాటు పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వాల హయాంలో సంక్షేమ పథకాలు కొందరికే పరిమితమయ్యాయని విమర్శిస్తూ, ప్రస్తుత ప్రజా ప్రభుత్వంలో కులం, మతం, పార్టీ అనే తేడా లేకుండా అర్హత, అవసరమే ప్రామాణికంగా పథకాలు అందిస్తున్నామని అన్నారు. ప్రజలకు అందాల్సిన సంక్షేమ ఫలాలు వారి ఇళ్ల వద్దకే చేరాలన్నదే ప్రభుత్వ సంకల్పమని, ఏ అవసరం వచ్చినా 24 గంటలూ అందుబాటులో ఉంటామని భరోసా ఇచ్చారు.ఎన్నికల సమయంలో ఇచ్చే తాత్కాలిక ప్రలోభాలకు లోనై తమ భవిష్యత్తును తాకట్టు పెట్టవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తాత్కాలిక డబ్బుల కంటే దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూర్చే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ప్రజల కష్టాల్లో తోడుగా నిలవడం, అర్హులకు ప్రభుత్వ సాయం అందించడం, ప్రతి కుటుంబానికి భరోసా కల్పించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

విద్యతోనే పేదరికంపై విజయం..

- **లక్ష్యమే విద్యార్థుల దిశ కావాలి... ఎంపీ డా.కడియం కావ్య**
- **విద్యతోనే పేదరికం నుంచి విముక్తి.. లక్ష్యసాధనపై దృష్టి పెట్టాలి**
- **కాకతీయ కళాశాల అభివృద్ధికి పీఎం ఉషా నిధుల కోసం కృషి చేస్తా... ఎంపీ**

హనుమకొండ, నవంబర్ 21 (సమయం న్యూస్)

విద్యార్థులు నిర్దిష్ట లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటి సాధనకు కష్టపడి చదవాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య సూచించారు. విద్యతోనే పేదరికం నుంచి బయటపడి ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని, చదువుపై పెట్టే పెట్టుబడి భవిష్యత్తు తరాలకు విలువైన ఆస్తిగా నిలుస్తుందని అన్నారు. శనివారం హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన 'జిజ్ఞాస 2025-26' రాష్ట్రస్థాయి బహుమతుల ప్రదానోత్సవానికి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డితో కలిసి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ విద్యార్థులు సివిల్స్, గ్రూప్స్ వంటి పోటీ పరీక్షలకు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని సూచించారు. ప్రతిభ ఎవరి సొత్తు కాదని, పట్టుదలతో శ్రమిస్తే ప్రతి ఒక్కరూ విజయం సాధించవచ్చన్నారు. కళాశాలలో వేలాది మంది విద్యార్థులు ఉన్నప్పటికీ ఇలాంటి కార్యక్రమాలకు మరింత మంది హాజరయ్యేలా అధ్యాపకులు ప్రోత్సహించాలని సూచించారు.కళాశాల వాతావరణంలో పొందే జ్ఞానం, అనుభవం విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం, కాకతీయ ప్రభుత్వ కళాశాల సహా ప్రభుత్వ విద్యాసంస్థల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. పార్లమెంట్ సమావేశాల్లో కాకతీయ విశ్వవిద్యాలయానికి రూసా, పీఎం ఉషా నిధుల మంజూరు అంశాన్ని ప్రస్తావిస్తున్నానన్నారు. కళాశాల అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలు, అంచనాలు సిద్ధం చేస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



కేంద్ర ప్రభుత్వ స్థాయిలోనూ కళాశాలకు పీఎం ఉషా నిధులు అందేలా ప్రయత్నిస్తానన్నారు. విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, సమస్యలు ఎదురైనప్పుడు వైద్యులను సంప్రదించాలని సూచించారు. డ్రగ్స్, సోషల్ మీడియా వ్యసనాలకు దూరంగా ఉంటూ చదువుపై ఏకాగ్రత పెంచుకోవాలన్నారు. విద్యార్థినులు ఆర్థిక స్వావలంబన సాధించి కుటుంబానికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ కళాశాలల్లో చదివి ఉన్నత స్థాయికి చేరుకున్న విద్యార్థులు సమాజానికి తిరిగి సేవ చేయాలన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాన్ని ఆచరణలో పెట్టాలని కోరారు. పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందించడంతో పాటు తమ అనుభవం, సమయాన్ని వెచ్చించి మార్గదర్శకులుగా నిలవాలన్నారు. కళాశాల వార్షికోత్సవానికి ఎమ్మెల్యేతో కలిసి హాజరవుతానని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్, ప్రొఫెసర్ చంద్రమౌళి, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, జిజ్ఞాస కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రాపర్టీ దొంగతనం కేసులను త్వరితగతిన ఛేదించాలి

- **జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS**

నారాయణపేట, నవంబర్,21(సమయం న్యూస్)

నారాయణపేట జిల్లా పరిధిలో ప్రాపర్టీ దొంగతనం కేసుల నియంత్రణ, నేరాల ఛేదన, దొంగిలించబడిన ఆస్తుల రికవరీకి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు జిల్లాలో నమోదవుతున్న ఆస్తి నేరాలు, ముఖ్యంగా ఇళ్ల దొంగతనాలు, బంగారు ఆభరణాలు, నగదు, వాహనాలు, ఇతర విలువైన వస్తువుల చోరీ కేసులపై పోలీసు అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... ప్రాపర్టీ దొంగతనం కేసులను అత్యంత ప్రాధాన్యతతో పరిగణించి, ప్రతి కేసును త్వరితగతిన ఛేదించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఆస్తి దొంగతనాలకు సంబంధించి బాధితులు ఫిర్యాదు చేసిన వెంటనే ఎలాంటి జాప్యం లేకుండా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించాలని స్పష్టం చేశారు. దొంగతనం జరిగిన వెంటనే సంబంధిత పోలీసు అధికారులు సంఘటనా స్థలాన్ని సందర్శించి,



క్లూస్ టీం, క్రైమ్ టీం, డాగ్ స్క్వాడ్ సహకారంతో క్షుణ్ణంగా పరిశీలించాలని, నేరస్థులకు సంబంధించిన వేలిముద్రలు, ఇతర భౌతిక ఆధారాలను సేకరించాలని ఆదేశించారు. బాధితుల నుంచి పూర్తి వివరాలు సేకరించి, దొంగతనం జరిగిన విధానం, సమయం, నేరస్థులు పారిపోయిన మార్గాలు తదితర అంశాలపై సమగ్రంగా దర్యాప్తు చేపట్టాలని తెలిపారు.ప్రాపర్టీ దొంగతనం కేసుల్లో నేరస్థులను గుర్తించేందుకు సంఘటనా స్థలాలు, పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ కెమెరాల ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించాలని,అనుమానిత వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకుంటూ నేరస్థుల ఆచూకీ గుర్తించాలని తెలిపారు. గతంలో దొంగతనాలకు పాల్పడిన పాత నేరస్థుల వివరాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, వారి ప్రస్తుత కదలికలపై నిఘా ఉంచాలని ఆదేశించారు. ఇతర జిల్లాలు, రాష్ట్రాల్లో ప్రాపర్టీ దొంగతనాలకు పాల్పడే ముఠాల కదలికలపై కూడా సమాచారాన్ని సేకరించి, అవసరమైన సమన్వయంతో దర్యాప్తు చేపట్టాలని సూచించారు. జిల్లాలో నమోదైన ప్రతి ప్రాపర్టీ దొంగతనం కేసు దర్యాప్తు పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని, పెండింగ్ కేసులను ప్రత్యేకంగా పరిశీలించి త్వరితగతిన ఛేదించేందుకు కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. దొంగిలించబడిన బంగారు ఆభరణాలు, నగదు, ద్విచక్ర వాహనాలు, ఇతర విలువైన వస్తువులను వీలైనంత త్వరగా రికవరీ చేసి బాధితులకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దొంగతనం కేసులను చేదించినప్పుడే ప్రజలకు పోలీసులపై విశ్వాసం పెరుగుతుందని, ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించడం పోలీసుల ప్రధాన బాధ్యత అని, బాధితులు పోలీస్ స్టేషన్‌కు వచ్చినప్పుడు వారి ఫిర్యాదులను సానుకూలంగా స్వీకరించి తక్షణ స్పందన అందించాలని తెలిపారు.ప్రాపర్టీ దొంగతనం కేసుల ఛేదనలో నిర్లక్ష్యం వహించకుండా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని, కేసుల దర్యాప్తులో జాప్యం జరగకుండా నిర్దేశిత సమయంలో ఫలితాలు సాధించాలని స్పష్టం చేశారు.ప్రాపర్టీ నేరాల నివారణకు పటిష్టమైన ముందస్తు చర్యలు చేపట్టాలని, దొంగతనాలకు పాల్పడే నేరస్థులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు.కేసుల ఛేదనలో నిర్లక్ష్యం వహించే అధికారులపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ సమావేశంలో డీఎస్పీలు మహేష్, నల్లపు లింగయ్య, సీఐలు శివశంకర్, రామ్ లాల్, భగవంత్ రెడ్డి, సైదులు, ఆర్ఐ విజయభాస్కర్, ఎస్ఐలు వెంకటేశ్వర్లు, భాగ్యలక్ష్మి రెడ్డి, పురుషోత్తం, బాలరాజు, సతీష్ రెడ్డి, నరేష్ రాజు, రమేష్, చంద్రశేఖర్, ఎస్.కృష్ణ, డీసీఆర్బీ, ఐటీ కోర్, క్లూస్ టీం సిబ్బంది పాల్గొన్నారు.

డ్రగ్స్ అక్రమ రవాణాపై భారత్–అమెరికా ఉమ్మడి పోరాటం

- **'ఆపరేషన్ మాన్‌సూన్ థండర్' విజయంపై అమిత్ షా అభినందనలు**

న్యూఢిల్లీ, నవంబర్ 21

సరిహద్దులు దాటి జరుగుతున్న మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు భారత్-అమెరికా సంయుక్తంగా చేపట్టిన 'ఆపరేషన్ మాన్‌సూన్ థండర్' విజయవంతం కావడంపై కేంద్ర హోంమంత్రి, సహకార శాఖ మంత్రి అమిత్ షా ఎన్‌సీబీ (NCB), అమెరికా డ్రగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడ్మినిస్ట్రేషన్ (DEA)ను అభినందించారు. ఈ ఆపరేషన్‌లో భారత్, అమెరికాలో జరిగిన అరెస్టులు, భారీగా డ్రగ్స్ స్వాధీనం చేసుకోవడం ఇరు దేశాల మధ్య బలమైన సహకారానికి నిదర్శనమని అమిత్ షా పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశంలోకి ఒక్క గ్రాము మాదకద్రవ్యాలు కూడా రాకుండా, దేశం నుంచి ఇతర దేశాలకు వెళ్లకుండా కఠిన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఎన్‌సీబీ-డీఈఏ సంయుక్త దర్యాప్తులో హైదరాబాద్ సహా నాలుగు నగరాల్లో ఆపరేషన్లు నిర్వహించి ఆరుగురిని అరెస్టు చేశారు. ఈ నెట్‌వర్క్ 2022 జూన్ నుంచి 2026 నవంబర్ వరకు దాదాపు 3,000 పార్సిళ్ల ద్వారా 5 లక్షల మాత్రలను అమెరికాకు చేరవేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది.అమెరికా అంబాసిడర్ సెర్గియో గోర్ కూడా ఆపరేషన్‌ను భారత్-అమెరికా భద్రతా సహకారానికి మంచి ఉదాహరణగా అభివర్ణించారు. గమనిక: హైదరాబాద్ పేరు ఉండటంతో ఇది తెలంగాణ పత్రికకు కూడా మంచి జాతీయ వార్త అవుతుంది. ప్రధాన శీర్షికగా "డ్రగ్స్ అక్రమ రవాణాపై భారత్-అమెరికా ఉక్కుపాదం" కూడా బాగుంటుంది.

సాగర్ పనులను వెంటనే ఆపాలి

- **తెలంగాణ నీళ్లను కాపాడే సోయి లేదా? కాంగ్రెస్‌ది నేరపూరిత నిర్లక్ష్యం**

నల్గొండ నవంబర్21

తెలంగాణకు రావాల్సిన కృష్ణా జలాలను కాపాడటంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి తీవ్రంగా విమర్శించారు. తెలంగాణ జలహక్కుల విషయంలో ప్రభుత్వం నేరపూరిత నిర్లక్ష్యానికి పాల్పడుతోందని ఆరోపించారు.నాగార్జునసాగర్‌లో ఆంధ్రప్రదేశ్ చేపడుతున్న పనులను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. పనులను అడ్డుకునేందుకు ప్రభుత్వం ఇప్పటివరకు ఏం చేసిందో ప్రజలకు వివరించాలని కోరారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రాసిన లేఖలు, వాటి డీఓ నంబర్లు, తేదీలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. "128 టీఎంసీల నీటిని వినియోగించామని చెప్పడం సరిపోదు. ఏ ప్రాజెక్టు నుంచి ఎంత నీటిని తీసుకున్నారు? సాగర్ ఎడమ కాలువ, లో లెవల్, హై లెవల్ కాలువల కింద ఎన్ని ఎకరాలకు నీరందించారు? ఎత్తిపోతల పథకాల ద్వారా ఎంత నీరు ఇచ్చారు? సంవత్సరాల వారీగా పూర్తి లెక్కలు వెల్లడించాలి" అని జగదీశ్‌రెడ్డి అన్నారు.తెలంగాణ ఎత్తిపోతల పథకాలపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న ఆంధ్రప్రదేశ్.. నాగార్జునసాగర్‌లో కొత్త పనులు చేపడుతున్నా ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. "వేలు పెట్టనిస్తే కాలు పెట్టినట్టుగా సాగర్‌లోనూ పరిస్థితి మారకూడదు" అని హెచ్చరించారు. రైతులను ఆరుతడి పంటలు సాగు చేయాలని సూచిస్తున్న ప్రభుత్వం, వాటికి నీరు ఎక్కడి నుంచి ఇస్తుందో చెప్పాలని డిమాండ్ చేశారు. "నీటి తడి లేకుండా ఏ గింజా మొలకెత్తదు. కూరగాయల సాగుకైనా నీళ్లు అవసరమే" అన్నారు. డి25, డి37, డి39, డి40 పరిధిలోని రైతులు కనీసం చెరువులకైనా నీరు అందించాలని ఎదురుచూస్తున్నారని తెలిపారు. తెలంగాణ తాగు, సాగునీటి అవసరాలకు అవసరమైన కృష్ణా జలాలను రక్షించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని జగదీశ్‌రెడ్డి డిమాండ్ చేశారు.

పొగమంచు పట్ల అప్రమత్తంగా ఉండండి

- **రోడ్డు ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు పాటించండి: జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS.**

వికారాబాద్, నవంబర్,21(సమయం న్యూస్)



చలికాలం నేపథ్యంలో ఉదయం వేళల్లో పొగమంచు కారణంగా రహదారులపై ఎదురుగా వచ్చే వాహనాలు స్పష్టంగా కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS సూచించారు.ముఖ్యంగా జాతీయ రహదారులు, ప్రధాన రహదారులు, గ్రామీణ రహదారులపై ప్రయాణించే వాహనదారులు వేగాన్ని తగ్గించి, తగిన జాగ్రత్తలు పాటించాలని కోరారు. పొగమంచు ఎక్కువగా ఉన్న సమయంలో వాహనాల హెడ్‌లైట్లు, ఫాగ్ లైట్లు తప్పనిసరిగా వినియోగించాలని, ముందు వెళ్తున్న వాహనానికి తగిన దూరం పాటించాలని సూచించారు. అనవసరంగా ఓవర్‌టేక్ చేయడం, వేగంగా ప్రయాణించడం, రాంగ్ రూట్‌లో వెళ్లడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ ధరించాలని సూచించారు. వాహనాలను రోడ్లపై ఎక్కడపడితే అక్కడ నిలిపివేయకుండా, అత్యవసర పరిస్థితుల్లో పార్కింగ్ లైట్లు లేదా హజార్డ్ లైట్లు వినియోగించాలని తెలిపారు.ప్రజల ప్రాణాల రక్షణే పోలీసుల ప్రధాన లక్ష్యమని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ బాధ్యతాయుతంగా ప్రయాణించాలని జిల్లా ఎస్పీ గారు విజ్ఞప్తి చేశారు. చిన్నపాటి నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదాలకు దారితీయవచ్చని,అప్రమత్తతతో ప్రయాణించి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు.

రామ్ జెఠ్మలానీ విగ్రహావిష్కరణ

- **కరీంనగర్ న్యాయ చరిత్రలో చిరస్మరణీయ ఘట్టం**

కరీంనగర్, నవంబర్ 21:

ప్రముఖ సీనియర్ న్యాయవాది, మాజీ కేంద్ర మంత్రి దివంగత రామ్ జెఠ్మలానీ విగ్రహాన్ని కరీంనగర్‌లోని జస్టిస్ కుమారయ్య కాలేజ్ ఆఫ్ లా ప్రాంగణంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ శనివారం వర్చువల్‌గా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.ఎస్. నరసింహా, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ పుల్లి చెర్ల సామ్ కోషి, న్యాయమూర్తి జస్టిస్ ఈ.వి. వేణుగోపాల్, రామ్ జెఠ్మలానీ కుమారుడు, సీనియర్ న్యాయవాది మహేశ్ జెఠ్మలానీ, జర్నలిస్టు స్వామినాథన్ గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయరంగానికి జెఠ్మలానీ అందించిన సేవలను ప్రముఖులు స్మరించుకున్నారు. అనంతరం కాలేజ్ కరస్పాండెంట్ డాక్టర్ కె. జలజ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్, సీనియర్ న్యాయవాదులు, న్యాయ విద్యార్థులు విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు.



బీఆర్ఎస్‌లోకి ఖైరతాబాద్ కాంగ్రెస్ నేతలు

- **బీఆర్ఎస్‌లోకి ఖైరతాబాద్ కాంగ్రెస్ నేతలు**

కాంగ్రెస్ పని అయిపోయింది.. బీఆర్ఎస్‌దే అధికారం: హరీశ్‌రావు

హైదరాబాద్: ఖైరతాబాద్ కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్, శ్రీనాథ్‌తో పాటు పలువురు నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పని అయిపోయిందని, త్వరలో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని అన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలే ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి పాలనలో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతిన్నదని, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, వైద్యం, విద్య రంగాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. రెండు లక్షల ఉద్యోగాల హామీ అమలు కాలేదని, ఫీజు రీయింబర్స్‌మెంట్, కేసీఆర్ కిట్ వంటి పథకాలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. బీజేపీ, కాంగ్రెస్ కలిసి తెలంగాణకు అన్యాయం చేస్తున్నాయని పేర్కొంటూ.. "తెలంగాణ మొత్తం కేసీఆర్ వైపు చూస్తోంది" అని హరీశ్‌రావు అన్నారు.

సంక్షేమ పథకాల అమలును నిశితంగా పరిశీలించాలి

- **ఆలిండియా సర్వీసెస్ అధికారులకు కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచన**

నిజామాబాద్, నవంబర్ 21

ఆలిండియా సర్వీసెస్ అధికారులు శిక్షణలో భాగంగా క్షేత్రస్థాయిలో అమలవుతున్న ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను నిశితంగా పరిశీలించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. 14 మంది అధికారులు ఈ నెల 21 నుంచి 28 వరకు జిల్లాలో పర్యటించనున్నారు. రెండు బృందాలుగా విభజించి అంకాపూర్, భూలక్ష్మిక్యాంప్ గ్రామాలను క్షేత్రస్థాయి పరిశీలనకు కేటాయించారు. భూభారతి కార్యక్రమం, వ్యవసాయం, సంక్షేమ పథకాల అమలు, ప్రజల జీవన స్థితిగతులను పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టును కూడా సందర్శించాలని తెలిపారు.



హెచ్ఐవి నియంత్రణలో నిజామాబాద్‌కు సురక్ష గుర్తింపు

నిజామాబాద్: హెచ్ఐవి/ఎయిడ్స్ నిర్ధారణ, నివారణ, నియంత్రణ కార్యక్రమాల్లో ఉత్తమ పనితీరు కనబరిచిన నిజామాబాద్ జిల్లాకు 'సురక్ష' స్థాయి గుర్తింపు లభించింది. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) భుజంగ రావును టీజీ సాక్స్ డిప్యూటీ డైరెక్టర్ నరేష్ రెడ్డి, అడిషనల్ డైరెక్టర్ ఫణిరేఖ, డీఎంహెచ్ఓ డాక్టర్ బి. రాజశ్రీ సత్కరించి అభినందించారు. జిల్లాలో హెచ్ఐవి పరీక్షలు, ఏఆర్టీ చికిత్సకు అనుసంధానం, గర్భిణుల స్క్రీనింగ్ తదితర కార్యక్రమాలను మరింత విస్తరించాలని నరేష్ రెడ్డి సూచించారు. 959595 లక్ష్యాలను 100 శాతం సాధించేందుకు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ భుజంగరావు అధికారులకు సూచించారు.



సిద్దిపేట జిల్లాకు 'సురక్షిత్' గుర్తింపు

సిద్దిపేట, నవంబర్ 21:

హెచ్ఐవీ/ఎయిడ్స్ నివారణ, నియంత్రణలో సిద్దిపేట జిల్లాకు 'సురక్షిత్' గుర్తింపు లభించింది. TGSACS, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న MAS కార్యక్రమంలో భాగంగా ఈ గుర్తింపు లభించింది.TGSACS జాయింట్ డైరెక్టర్ డాక్టర్ అనురాధ తన్నీరు జిల్లా కలెక్టర్ హైమావతిని సత్కరించి అభినందించారు. 959595 లక్ష్యాల సాధన, చికిత్సకు దూరమైన వారిని తిరిగి చికిత్సలోకి తీసుకురావడం, వైరల్ లోడ్ పరీక్షలపై సమీక్ష నిర్వహించారు.జిల్లా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ, హెచ్ఐవీ నియంత్రణలో సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేసి 100 100100 లక్ష్యాలను సాధించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, ART, ICTC, DAPCU, NGO, CSC సిబ్బంది పాల్గొన్నారు.



జపాన్‌లో జైకా అధ్యయన పర్యటన పూర్తి చేసిన కలెక్టర్

భద్రాద్రి కొత్తగూడెం నవంబర్21

నీతి ఆయోగ్, జైకా సంయుక్తంగా నిర్వహించిన అధ్యయన పర్యటనలో జిల్లా కలెక్టర్ అంకిత్ పాల్గొన్నారు. నవంబర్ 15 నుంచి 21 వరకు జరిగిన పర్యటనలో జపాన్‌లో విద్య, ఆరోగ్యం, పోషణ, స్థానిక పాలన, ప్రజలకు సేవల అందజేతలో అమలవుతున్న ఉత్తమ విధానాలను అధ్యయనం చేశారు. నెరిమా నగరంలోని టొయోటామా ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యా విధానాలు, పాఠశాల నిర్వహణపై అధ్యయనం చేశారు. మిటో నగర పాలన, సోనీ సంస్థలో సంస్థాగత మార్పులు, నాయకత్వ విధానాలను పరిశీలించారు. జపాన్‌లో గుర్తించిన ఉత్తమ విధానాలను జిల్లాలోని స్థానిక పరిస్థితులకు అనుగుణంగా అమలు చేసి, ముఖ్యంగా ఆకాంక్షిత మండలాల్లో విద్య, ఆరోగ్యం, పోషణ రంగాల్లో సేవల నాణ్యతను మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు.



బస్టాండ్ ఆధునీకరణకు చర్యలు చేపట్టాలి

- **అభివృద్ధి పనుల ప్రతిపాదనలు సిద్ధం చేయండి..**
- **ఆర్టీసీ అధికారులకు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశం**

నర్సంపేట, నవంబర్ 21 (సమయం న్యూస్)



బస్సు స్టేషన్‌ను ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేసి ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పించేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. బస్టాండ్‌లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేయాలని సూచించారు. ఈ మేరకు శనివారం టీజీ ఆర్టీసీ ఈడీ రాజశేఖర్, కరీంనగర్ జోన్ ఈడీ సోలేమన్‌లతో కలిసి నర్సంపేట బస్సు స్టేషన్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. ప్రయాణికులకు ఎదురవుతున్న ఇబ్బందులు, బస్టాండ్‌లో కల్పించాల్సిన సౌకర్యాలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అధికారులతో చర్చించారు. ఆర్టీసీ ఇంజినీరింగ్ విభాగం చీఫ్ ఇంజినీర్ కవితకు బస్టాండ్ ఆధునీకరణకు అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు.చెన్నారావుపేట మండలం జల్లి గ్రామంలో ప్రజల రవాణా అవసరాలకు అనుగుణంగా నూతన బస్టాండ్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం నెక్కొండ మండల కేంద్రంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి, పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని, నిర్ణీత ప్రమాణాలతో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడంతో పాటు మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత నిస్తూ పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

AMR, ఇన్ఫెక్షన్ కంట్రోల్‌పై నర్సింగ్ సిబ్బందికి అవగాహన

- **ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో క్విజ్ పోటీ నిర్వహణ**

మల్కాజిగిరి, సమయం:



ప్రపంచ యాంటీమైక్రోబియల్ అవేర్‌నెస్ వీక్ (WAAW-2026) సందర్భంగా కుత్బుల్లాపూర్‌లోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నర్సింగ్ సిబ్బందికి యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్ (AMR), ఇన్ఫెక్షన్ కంట్రోల్ విధానాలపై అవగాహన కల్పించేందుకు క్విజ్ పోటీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యులు, పరిపాలనా సిబ్బంది, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు. యాంటీబయాటిక్స్‌ను వైద్యుల సూచనల మేరకు బాధ్యతాయుతంగా వినియోగించడం, వాటి దుర్వినియోగం వల్ల ఏర్పడే యాంటీమైక్రోబియల్ నిరోధకతను అరికట్టడం, ఆసుపత్రుల్లో ఇన్ఫెక్షన్ల వ్యాప్తిని నియంత్రించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ మాట్లాడుతూ.. యాంటీబయాటిక్స్‌ను అవసరమైనప్పుడు మాత్రమే సరైన పద్ధతిలో వినియోగించాలని, ఇన్ఫెక్షన్ నియంత్రణ నిబంధనలను ప్రతి ఆరోగ్య కార్యకర్త తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అనంతరం నిర్వహించిన క్విజ్ పోటీలో నర్సింగ్ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని తమ పరిజ్ఞానాన్ని ప్రదర్శించారు. యాంటీబయాటిక్ నిరోధకతను అరికట్టడంలో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది సహా ప్రతి ఆరోగ్య కార్యకర్త కీలక బాధ్యత వహించాలని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

ఆశా వర్కర్లను కార్మికులుగా గుర్తించాలి

- **నెలకు రూ.42 వేల కనీస వేతనం చెల్లించాలి.. డిసెంబర్ 1, 2, 3 తేదీల్లో చలో పార్లమెంట్‌ను విజయవంతం చేయాలి**

మల్కాజిగిరి, సమయం:



ఆశా వర్కర్లను ప్రభుత్వ కార్మికులుగా గుర్తించి, నెలకు కనీసం రూ.42 వేల వేతనం చెల్లించాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. రేవతి కళ్యాణి డిమాండ్ చేశారు. ఈ మేరకు డిసెంబర్ 1, 2, 3 తేదీల్లో ఢిల్లీలో నిర్వహించనున్న చలో పార్లమెంట్ మార్చ్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా కుషాయిగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద చలో పార్లమెంట్ మార్చ్‌కు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం రేవతి కళ్యాణి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశా వర్కర్లతో నిరంతరం సేవలు చేయించుకుంటున్నప్పటికీ వారి శ్రమకు తగిన ప్రతిఫలం అందించడం లేదని విమర్శించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజారోగ్య పరిరక్షణలో ఆశా వర్కర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని, గర్భిణుల సంరక్షణ, శిశు ఆరోగ్యం, టీకాల కార్యక్రమాలు, కుటుంబ సంక్షేమం, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలులో నిరంతరం సేవలందిస్తున్నారని తెలిపారు.అయినప్పటికీ ఆశా వర్కర్లకు ఉద్యోగుల గుర్తింపు, కనీస వేతనం, ఉద్యోగ భద్రతతో పాటు పెన్షన్, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సామాజిక భద్రతా సౌకర్యాలు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రోజురోజుకూ పనిభారం పెరుగుతున్నా అందుకు తగిన పారితోషికం ఇవ్వడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు కార్మికుల హక్కులకు విఘాతం కలిగిస్తున్నాయని పేర్కొన్నారు.ఆశా వర్కర్లను కార్మికులుగా గుర్తించి నెలకు రూ.42 వేల కనీస వేతనం చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పెన్షన్, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయడంతో పాటు పని పరిస్థితులను మెరుగుపరిచి, పనిభారం, వేధింపులు తగ్గించాలని కోరారు. ఈ డిమాండ్ల సాధన కోసం డిసెంబర్ 1, 2, 3 తేదీల్లో ఢిల్లీలో జరిగే పార్లమెంట్ మార్చ్‌లో ఆశా వర్కర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ఐక్యతను చాటాలని రేవతి కళ్యాణి పిలుపునిచ్చారు.

బాలికల్లో ఆత్మవిశ్వాసం నింపుతున్న 'ధీరా'

- **స్వీయరక్షణ, మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ.. ఐదో విడతలో 750 మందికి పైగా విద్యార్థినుల భాగస్వామ్యం**
- **ప్రతి బాలిక తనను తాను రక్షించుకునే సామర్థ్యం కలిగి ఉండాలి: సీపీ బి. సుమతి**

మల్కాజిగిరి, సమయం:

బాలికల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు స్వీయరక్షణ నైపుణ్యాలను నేర్పించడమే లక్ష్యంగా మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ మహిళా భద్రతా విభాగం చేపట్టిన 'ధీరా' కార్యక్రమం కొనసాగుతోంది. ఇందులో భాగంగా శనివారం కుషాయిగూడలోని తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజీ (బాలికలు)లో ఐదో విడత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 750 మందికి పైగా విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు.బాలికలకు స్వీయరక్షణ పద్ధతులు, మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ అందించడం, శారీరక దృఢత్వాన్ని పెంపొందించడం, వ్యక్తిగత భద్రతపై అవగాహన కల్పించడం ధీరా కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పోలీస్ అధికారులు తెలిపారు. ఇప్పటివరకు మునగానూరు, కీసర, అంకుశాపూర్, చైతన్యపురి ప్రాంతాల్లో నిర్వహించిన కార్యక్రమాలకు వేలాది మంది విద్యార్థినులు హాజరయ్యారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ బి. సుమతి, ఐపీఎస్ మాట్లాడుతూ.. మహిళలు, బాలికల భద్రత, రక్షణ, సాధికారత, సంక్షేమానికి మల్కాజిగిరి కమిషనరేట్ మహిళా భద్రతా విభాగం సమగ్ర కార్యాచరణతో పనిచేస్తోందన్నారు. భరోసా కేంద్రాలు, షీ టీమ్స్, సీడీఈడబ్ల్యూ కుటుంబ సలహా కేంద్రాలు, మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం, మహిళా పోలీస్ స్టేషన్ల ద్వారా బాధితులకు రక్షణ, కౌన్సెలింగ్, పునరావాసం, చట్టపరమైన సహాయం అందిస్తున్నట్లు వివరించారు.అత్యవసర సమయంలో 112కు ఫోన్ చేయాలిభద్రతకు సంబంధించిన సమస్యలు ఎప్పుడైనా ఎదురుకావచ్చని, అలాంటి సమయంలో భయపడకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని సీపీ సూచించారు. తమకు లేదా ఇతరులకు ప్రమాదం ఎదురైనప్పుడు 112 అత్యవసర నంబర్‌కు ఫోన్ చేసి పోలీసుల సహాయం పొందాలని విద్యార్థినులకు తెలిపారు. గత ఏడు నెలల్లో కమిషనరేట్ పరిధిలో మహిళలు, బాలికలపై దుర్వినియోగానికి సంబంధించి సుమారు 335 కేసులు నమోదయ్యాయని వెల్లడించారు. ఈ నేపథ్యంలో విద్యార్థినులు, తల్లిదండ్రులు, సమాజంలో మరింత అవగాహన పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి పౌరుడికి తన సమస్యలను తెలియజేసి, రక్షణ కోరే చట్టపరమైన హక్కు ఉందని స్పష్టం చేశారు. బాలికలు తమ హక్కులపై అవగాహన పెంచుకొని, అవసరమైనప్పుడు ధైర్యంగా వినియోగించుకోవాలని సూచించారు.స్వీయరక్షణ అంటే కేవలం శారీరక బలం మాత్రమే కాదని, మానసిక స్థైర్యం, అప్రమత్తత, సమయస్ఫూర్తి, సరైన నిర్ణయం తీసుకునే సామర్థ్యం కూడా ముఖ్యమని పేర్కొన్నారు.

5 వేల మందికి పైగా బాలికలకు శిక్షణ

మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోని ఏడు సబ్ డివిజన్ల నుంచి ఒక్కో పాఠశాలను ఎంపిక చేసి, 5 వేల మందికి పైగా విద్యార్థినులకు క్రమబద్ధమైన స్వీయరక్షణ శిక్షణ అందించనున్నట్లు సీపీ తెలిపారు. ఇందులో భాగంగా శారీరక విద్యా ఉపాధ్యాయులు (పీఈటీలు) స్వీయరక్షణ పద్ధతులను ప్రదర్శించి వీడియోల రూపంలో రూపొందించారు.వాటి ద్వారా విద్యార్థినులు పద్ధతులను నేర్చుకొని నిరంతరం సాధన చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. శిక్షణ పూర్తయిన అనంతరం ఆయా పాఠశాలల విద్యార్థినులతో సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అక్కడ విద్యార్థినుల ప్రదర్శనలను పరిశీలించి, మూల్యాంకనం చేసి ఉత్తమ ప్రతిభ కనబరిచిన పాఠశాలను ఎంపిక చేయనున్నట్లు వివరించారు. విద్యార్థినులు శిక్షణలో నేర్చుకున్న పద్ధతులను క్రమం తప్పకుండా సాధన చేస్తూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సీపీ సూచించారు. క్లిష్ట పరిస్థితుల్లో ప్రశాంతంగా ఉండటం, స్పష్టంగా ఆలోచించడం, సరైన సమయంలో తగిన నిర్ణయం తీసుకోవడం అలవర్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సునీతా రాణి మాట్లాడుతూ.. పోలీస్ కమిషనర్ చొరవతో విద్యార్థినులకు ఇలాంటి శిక్షణ అందించడం అభినందనీయమన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థినులందరూ సద్వినియోగం చేసుకొని చురుకుగా పాల్గొనాలని కోరారు.కార్యక్రమంలో మహిళా భద్రతా విభాగం డీసీపీ టి. ఉషారాణి, ఉప్పల్ జోన్ అదనపు డీసీపీ ఎన్. వెంకటరమణ, మహిళా భద్రతా విభాగం ఏసీపీ పి. వెంకటేశ్వర్లు, ఉప్పల్ డివిజన్ ఏసీపీ వెంకట్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ సునీతా రాణి, కరాటే మాస్టర్, 8వ డాన్ బ్లాక్ బెల్ట్ హోల్డర్ వసంత్ కుమార్, కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్ భాస్కర్ రెడ్డి, షీ టీమ్స్ ఇన్‌స్పెక్టర్ జి. అంజయ్య, అడ్మిన్ ఎస్ఐ యాదగిరి రెడ్డి, ఉప్పల్ షీ టీమ్స్ ఇన్‌చార్జి నళినీ కుమారి వార్సీ, షీ టీమ్స్ సిబ్బంది, కుషాయిగూడ

పట్టభద్రుల ఓటరు నమోదును వేగవంతం చేయాలి

- **అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలి...ఎంపీ కడియం కావ్య**
- **ఎంపీ' ని మర్యాదపూర్వకంగా కలిసిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి**

హనుమకొండ, నవంబర్ 21 (సమయం న్యూస్)



వరంగల్ -ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన ప్రతి పట్టభద్రుడికి ఓటు హక్కు కల్పించేలా నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య సూచించారు. ఓటరు నమోదుపై క్షేత్రస్థాయిలో ప్రత్యేక దృష్టి సారించి, సమన్వయంతో పనిచేయాలని అన్నారు.శనివారం హనుమకొండ కనకదుర్గ కాలనీలోని ఎంపీ కార్యాలయంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో రాజకీయ పరిస్థితులు, ఎమ్మెల్సీ ఎన్నికల సన్నద్ధత, పార్టీ పరంగా చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు.మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలో అర్హులైన పట్టభద్రులను గుర్తించి ఓటరుగా నమోదు చేయించేలా కృషి చేయాలని నిర్ణయించారు. నియోజకవర్గాల వారీగా నమోదు ప్రక్రియను పర్యవేక్షిస్తూ, అర్హులైన ఒక్కరూ ఓటు హక్కుకు దూరం కాకుండా చూడాలని అభిప్రాయపడ్డారు. పట్టభద్రుల ఓటరు నమోదు నుంచి ఎన్నికల నిర్వహణ వరకు పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని, యువత, విద్యావంతులను ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములను చేయాలని చర్చించారు. ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై కార్యాచరణ రూపొందించుకోవాలని నిర్ణయించారు.